జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

రంగారెడ్డి | శుక్రవారం 6 మార్చి 2026 | సంపుటి : 1 | సంచిక : 63 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పూర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from RANGAREDDY, WARANGAL, KAMMAM, NALAGONDA http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

WANTED


గత 15 సంవత్సరాలుగా ప్రజల మన్ననలు పొందుతూ ప్రజల సమస్యలే ధ్యేయంగా పోరాడుతున్న "ప్రజాజ్యోతి" జాతీయ దినపత్రికకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా జిల్లా స్టాఫ్ రిపోర్టర్, ఎడ్యూకేషన్ ఇంఛార్జీలు మరియు మండల రిపోర్టర్లు కావలెను.

అనుభవం కలిగిన రిపోర్టర్లు మరియు చక్కటి వార్తలు రాయగలిగే కొత్తవారికి కూడా అవకాశం కల్పించబడును.

ప్రజాజ్యోతి

సంప్రదించవలసిన నెంబర్లు

9440231967, 7989694528



## తొలిసారిగా డిజిటల్ జనగణన

- యాప్, వెబ్సైట్లను ఆవిష్కరించిన అమిత్ షా
- రెండు దశల్లో భారీ కసరత్తు..
- బరిలో 30 లక్షల మంది సిబ్బంది
- 16 భాషల్లో ఆన్‌లైన్‌లో స్వీయ నమోదుకు అవకాశం
- రెండో దశలో 2027 మార్చి ఒకటి నుంచి కులగణన

5



## ఎలాంటి సమయంలోనైనా చమురు సరఫరా చేయడానికి మేం సిద్ధం

అంతర్జాతీయ పరిస్థితులు ఎలా ఉన్నా భారత్‌కు ఆయిల్ ఇచ్చేందుకు సిద్ధమన్న రష్యా రాయబారి



## అప్పుడే భగభగలు

### రాష్ట్రంలో 39 డిగ్రీలను తాకిన ఎండలు

### నేడు 6 జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు

హైదరాబాద్

రాష్ట్రంలో ఎండల తీవ్రత ప్రారంభమైంది. ఈ ఏడాదిలో తొలిసారి గురువారం ములుగు జిల్లా మంగపేటలో 39 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్ అర్బన్, ధర్మపురి, ఖమ్మం అర్బన్ ప్రాంతాల్లోనూ 38.9 డిగ్రీలు, మరో 14 జిల్లాల్లో 38.5 డిగ్రీల సెల్సియస్‌పైన ఉష్ణోగ్రత నమోదైంది. రాష్ట్రవ్యాప్తంగానూ ఎండ తీవ్రత పెరిగింది. మధ్యాహ్నం పూట ఆరుబయటకు వచ్చిన వారు నిట్టూర్చారు. రెండు రోజులుగా అనేక ప్రాంతాల్లో సాధారణం కన్నా 2.2 డిగ్రీల అధిక ఉష్ణోగ్రత నమోదవుతోంది. శుక్రవారం 6 జిల్లాల్లో 40 డిగ్రీలపైన నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ శాస్త్రవేత్తలు - మిగతా2లో

# ఎస్ఐఆర్‌కు వేగంగా కార్యాచరణ

- ప్రింటింగ్ మెటీరియల్, కిట్స్ కోసం టెండర్లు పిలిచిన ఎన్నికల సంఘం
- నేడు ఆర్థిక బిడ్స్ తెరవనున్న అధికారులు
- బీఎల్ఓలకు వారం రోజులపాటు తుది దశ శిక్షణ
- ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొననున్న 60 వేల మంది సిబ్బంది
- సెప్టెంబర్ నాటికల్లా ఓటరు జాబితా వెలువడే అవకాశం



హైదరాబాద్

రాష్ట్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్)కు ఎన్నికల సంఘం కార్యాచరణ వేగవంతం చేసింది. ఏప్రిల్ రెండో వారం నుంచి ఈ ప్రక్రియ చేపట్టనున్న నేపథ్యంలో ఓటర్ల ఎన్యూమరేటర్ల నుంచి సేకరించాల్సిన డేటాకు సంబంధించిన ఫారాల ముద్రణ, బీఎల్ఓలకు శిక్షణ, వారికి అవసరమైన కిట్స్ పంపిణీ కోసం అధికారులు టెండర్లు పిలిచారు. ఈ టెండర్ల ఆర్థిక బిడ్స్‌ను శుక్రవారం తెరవనున్నారు. ఆ తరువాత కాంట్రాక్టర్లకు ఆ బాధ్యత - మిగతా2లో

## భారత ప్రభుత్వం ఎన్నడూ ఇంత పిరికిగా వ్యవహరించలేదు

- ప్రధాని మోదీ ఇతర దేశాలకు సరెండర్ చేసి రాజీకి వచ్చారు
- భారత్ పొరుగుదేశాలకు పశ్చిమాసియా ఉద్రిక్తతలు
- అయినా మోదీ మౌనమే వహిస్తారా? రాహుల్ గాంధీ

5





## రాజ్యసభకు నితీశ్ నామినేషన్

- నామినేషన్ వేయడానికి ముందు అమిత్ షా, నితిన్ నబీన్‌తో భేటీ అయిన నితీశ్ కుమార్
- బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబీన్ కూడా
- బిహార్‌లో మొత్తం ఆరుగురు అభ్యర్థుల నామినేషన్లు
- సీఎం పదవి నుంచి తప్పుకుంటున్నట్లు నితీశ్ ప్రకటన
- కొత్త ప్రభుత్వానికి తన సహకారం

5



## సింఘ్వీ, వేం ఎన్నిక ఏకగ్రీవమే!

### సంఖ్యాబలం లేక రాజ్యసభ పోటీలో నిలవని ప్రతిపక్ష బీఆర్ఎస్

### ఎమ్మెల్యేలెవరూ బలపరచకుండానే స్వతంత్ర అభ్యర్థిగా ఒకరి నామినేషన్

### నేడు స్క్రూటినీలో తిరస్కరణకు గురవుతుందన్న అసెంబ్లీ వర్గాలు


### సీఎం సమక్షంలో నామినేషన్లు వేసిన సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి.. ఎన్నిక లాంఛనమే

హైదరాబాద్

తెలంగాణ నుంచి రాజ్యసభకు అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి ఎన్నిక ఏకగ్రీవం కానుంది. కాంగ్రెస్ పార్టీ వారిద్దరినీ రాజ్యసభ అభ్యర్థులుగా ఎంపిక చేయగా గురువారం శాసనసభ ప్రాంగణంలో ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలను సమర్పించారు. తగినంత సంఖ్యాబలం లేనందున బీఆర్ఎస్ రాజ్యసభ ఎన్నికల బరిలో ఎవరినీ పోటీకి నిలపలేదు. సాయి అనే వ్యక్తి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసినప్పటికీ 10 మంది ఎమ్మెల్యేలు బలపరచాలనే నిబంధనను పాటించని కారణంగా ఆయన అభ్యర్థిత్వం శుక్రవారం సరీ?క్రటినీలో తిరస్కరణకు గురవుతుందని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. దీంతో రాష్ట్రం నుంచి రాజ్యసభకు పార్టీ హైకమాండ్ ప్రతిపాదించిన సింఘ్వీ రెండోసారి, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్నేహితుడు వేం నరేందర్‌రెడ్డి రాజ్యసభలో అడుగుపెట్టడం లాంఛనం కానుంది. కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్రం నుంచి రాజ్యసభ - మిగతా2లో

- ఇరాన్‌లో బాలిస్టిక్ క్షిపణి కేంద్రాలపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు
- లెబనాన్‌లో హెజ్‌బొల్లా స్థావరాలపైనా..
- యుద్ధాన్ని విస్తరిస్తున్న ఇరాన్
- అజర్‌బైజాన్‌పైకి డ్రోన్లు - ఒమన్ పోర్టుపైనా..
- గల్ఫ్ దేశాలపై కొనసాగింపు
- యుద్ధనౌకపై దాడికి ప్రతీకారం తీర్చుకుంటాం; ఇరాన్
- శ్రీలంక తీరంలోకి మరో ఇరాన్ నౌక

# దద్దరిల్లిన పశ్చిమాసియా



దుబాయ్

క్షిపణులు, బాంబులు, డ్రోన్ల దాడులతో యుద్ధం ఆరో రోజైన గురువారమూ పశ్చిమాసియా దద్దరిల్లింది. కొత్త ప్రాంతాలకూ దాడులు విస్తరించాయి. ఇరాన్‌లోని దీర్ఘ శ్రేణి బాలిస్టిక్ క్షిపణి కేంద్రాలతోపాటు టెహ్రాన్‌సహా ఇతర నగరాలపై ఇజ్రాయెల్ వరుస వైమానిక దాడులు చేసింది. లెబనాన్‌లోని 80 హెజ్‌బొల్లా మిలిటెంట్ల కేంద్రాలపైనా విరుచుకుపడింది. ఇరాన్ కూడా దాడులను కొనసాగించింది. ఇజ్రాయెల్‌లోని టెల్ అవీవ్, జెరూసలెంలపై క్షిపణులు, డ్రోన్ల వర్షం కురిపించింది. కొత్తగా అజర్‌బైజాన్‌పై దాడులు చేసింది. ఒమన్ పోర్టుపైనా దాడి చేసినట్లు సమాచారం. గల్ఫ్ దేశాలనూ ఇరాన్ మరోసారి లక్ష్యంగా చేసుకుంది. హిందూ మహా సముద్రంలో తమ యుద్ధ నౌకను ముంచేయడంపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. సముద్రంలో దారుణానికి అమెరికా పాల్పడిందని, - మిగతా2లో

# గట్టుపొడిచినవాగు వద్ద ట్రాప్ కెమెరాకు చిక్కిన పెద్ద పులి

నిజామాబాద్

జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల నుంచి నిజామాబాద్ జిల్లాలోకి వచ్చిన పెద్ద పులి ప్రస్తుతం కమ్మర్‌పల్లి రేంజ్ పరిధిలోని గట్టుపొడిచినవాగు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రాంతంలో సేదతీరుతోంది. గురువారం తెల్లవారుజామున అటవీ శాఖ అమర్చిన ట్రాప్ కెమెరాకు పెద్ద పులి కదలికలు చిక్కడంతో కచ్చితంగా నిర్ధారణ అయింది. మహారాష్ట్రలోని తడోబా అడవి నుంచి వచ్చిన ఈ పులి కొన్ని నెలలుగా ఆదిలాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో సంచరిస్తోంది. మూడు రోజుల క్రితం కమ్మర్‌పల్లి రేంజ్‌లోకి వచ్చిన ఈ పులి ఇదేచోట వన్యప్రాణిని చంపి తిని, ఇక్కడే దాహార్తిని తీర్చుకుని సేద తీరుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పెద్ద పులి కదలికలపై పూర్తి స్థాయి సమాచారం కోసం అటవీ అధికారులు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. గట్టుపొడిచినవాగు బ్యాక్‌వాటర్ ప్రాంతంలో గురువారం అటవీ అధికారుల బృందం పెట్రోలింగ్ చేస్తున్న సందర్భంలో బీట్ అధికారి శ్రీదేవికి అలసట రావడంతో అక్కడే ఉన్న కల్వర్టు మీద కూర్చున్నారు. ఇది గమనించకుండా బృందంలోని మిగిలిన సభ్యులు కొంత ముందుకు వెళ్లారు. ఇదే సమయంలో వెనుక వైపు 30 మీటర్ల దూరంలో అలికిడి వినిపించడంతో శ్రీదేవి ఆవైపు చూడగా, పెద్ద పులి నడిచి వెళుతూ కనిపించింది. దీంతో ఆమె అక్కడికక్కడే మూర్ఛపోయారు. కల్వర్టుకు ఇవతలివైపు పడిపోయారు. అధికారుల బృందం తక్షణమే ఆమెను ఆస్పత్రికి తరలించారు. కల్వర్టుకు అవతలివైపు పడిపోయి ఉంటే పులికి ఆహారం అయ్యేదానినని శ్రీదేవి విలపిస్తుండటంతో అధికారులు సైతం భయాందోళనకు గురవుతున్నారు.



మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యంలో పెద్ద పులులు స్వేచ్ఛగా విహరిస్తున్నాయి. అటవీ శాఖ చేపట్టిన జంగిల్ సఫారీలో భాగంగా పర్యాటకులకు తరచూ పెద్ద పులులు కనిపిస్తూ సందడి చేస్తున్నాయి. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి విధుల్లో భాగంగా సఫారీ వాహనంలో వెళ్తున్న అటవీ శాఖ అధికారులు, సిబ్బందికి.. గుండం వద్ద చెట్ల పొదల నుంచి వచ్చిన పెద్దపులి కనిపించింది. సఫారీ వాహనం దీపాలను ఏమాత్రం పట్టించుకోకుండా రోడ్డుపైనే ఠీవిగా నడుచుకుంటూ సాగిపోయింది. దీంతో అధికారులు తమ సెల్‌ఫోన్లలో పులి కదలికలను వీడియోలు తీశారు.ఋ

**కెమెరాకు చిక్కిన చిరుతపులి**

బోథ్: ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం కరత్వాడ గ్రామ శివారులోని లక్కాయి లొద్ది వద్ద చిరుతపులి సంచారం స్థానికులను భయాందోళనకు గురిచేస్తోంది. రెండు రోజుల క్రితం కరత్వాడ గ్రామానికి చెందిన ద్యాగాల గంగయ్యకు చెందిన ఆవు.. లక్కాయి లొద్ది వద్ద అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. దీనిని చిరుత దాడిగానే భావించిన అటవీ శాఖ అధికారులు అక్కడ ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 5.29 గంటల ప్రాంతంలో ఆవు కళేబరాన్ని చిరుత తింటున్న దృశ్యాలు కెమెరాలో రికార్డయ్యాయి. దీంతో ఆవును చంపింది చిరుతేనని అటవీ అధికారులు ధ్రువీకరించారు. చిరుత సంచారం దృష్ట్యా అటవీ ప్రాంత గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. పశువుల కాపరులు, వృద్ధులు అడవిలోకి వెళ్లవద్దని సూచించారు.

# డిండి.. 'ఏదుల' గండి

హైదరాబాద్

ఏదుల రిజర్వాయర్‌లో నీటిమట్టం కనీసం 440 మీటర్లు ఉన్నప్పుడే డిండి, పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకాలకు నీటిని తరలించాలని రాష్ట్ర ప్రభుత్వానికి నీటిపారుదల శాఖ సిఫారసు చేసింది. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా నిర్మించిన ఏదుల రిజర్వాయర్ నుంచే డిండి ఎత్తిపోతల పథకానికి సైతం నీటిని తరలించడానికి అనుమతిస్తూ గతేడాది జనవరి 22న నీటిపారుదల శాఖ జీఓ 10 జారీ చేసింది. ఏదుల రిజర్వాయర్‌లో 336 మీటర్ల నీటిమట్టం నుంచి డిండి ఎత్తిపోతల పథకానికి నీటిని తరలించడానికి పనులు చేపట్టాలని అప్పట్లో కోరింది. గత నెల 6న నీటిపారుదల శాఖ ఈఎన్సీ (జనరల్) నేతృత్వంలోని కమిటీ డిండి ప్రాజెక్టును క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది.



**నిల్వలు 440 మీటర్లు ఉంటేనే...**

ఏదుల రిజర్వాయర్‌లో కనీసం 437.375 మీటర్ల నీటి మట్టం ఉంటేనే పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నుంచి వీరాంజనేయ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు నీటిని తరలించాలని గతంలో అనుమతులిచ్చారు. ఏదుల జలాశయ గరిష్ట నీటినిల్వ మట్టం (ఎఫ్ఆర్ఎల్) 445 మీటర్లు కాగా, గరిష్ట నిల్వ సామర్థ్యం 6.59 టీఎంసీలు. జలాశయంలో 440 మీటర్ల మట్టంతో 4.16 టీఎంసీలు, 437 మీటర్ల మట్టంతో 3.04 టీఎంసీల నిల్వలు, 436 మీటర్ల మట్టంతో 2.72 టీఎంసీల నిల్వలు ఉంటాయి.

డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా ఏదుల రిజర్వాయర్ నుంచి నీటిని తరలించడానికి నిర్మిస్తున్న కాల్వ అడుగు (బెడ్ లెవల్) 21.643 కి.మీ.ల వద్ద 421.45 మీటర్ల మట్టాన్ని కలిగి ఉండగా, ప్రతిపాదనల ప్రకారం ఏదులలో 436.41 మీటర్ల మట్టం నుంచి నీటిని తరలించాల్సి ఉంది. డిండి ఎత్తిపోతలకు నీటిని తరలించడానికి ఏదుల రిజర్వాయర్‌లో ఉండాల్సిన నీటిమట్టం, డిండి ప్రాజెక్టు కాల్వ లోతు మధ్య 4.9 మీటర్ల వ్యత్యాసం ఉంది. ఈ నేపథ్యంలో డిండి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని తరలించడానికి ఏదుల రిజర్వాయర్‌లో ఉండాల్సిన కనీస నిల్వ మట్టాన్ని 440 మీటర్లకు పెంచాలని ఈఎన్సీ(జనరల్) నేతృత్వంలోని కమిటీ ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఏదుల రిజర్వాయర్‌ను 440 మీటర్లకు నింపడానికి కేవలం 2 రోజులే పడుతుందని, దీని వల్ల ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలియజేసింది. ఏదులలో 440 మీటర్ల స్థాయిలో నిల్వలున్నప్పుడే డిండి, పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయాలని సూచించింది. ఈ మేరకు రెండు ప్రాజెక్టుల అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరింది. శ్రీశైలం జలాశయం నుంచి రోజుకు 2 టీఎంసీల చొప్పున మొత్తం 90 టీఎంసీలను తరలించడానికి పాలమూరు--రంగారెడ్డి ప్రాజెక్టును నిర్మిస్తుండగా, రోజుకు 0.5 టీఎంసీల చొప్పున మొత్తం 30 టీఎంసీలను తరలించుకోవడానికి డిండి ఎత్తిపోతల పథకాన్ని చేపట్టారు.

డిండి ఎత్తిపోతల పథకం ద్వారా నాగర్‌కర్నూల్, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి జిల్లాల్లోని 21 మండలాల పరిధిలో 3.61 లక్షల ఎకరాల ఆయకట్టును ప్రతిపాదించారు. ఏదుల రిజర్వాయర్ నీటిమట్టం 440 మీటర్లకు చేరినప్పుడే డిండి ఎత్తిపోతలకు నీటిని విడుదల చేయాలని నీటిపారుదల శాఖ తీసుకున్న నిర్ణయంతో ఉమ్మడి నల్లగొండ జిల్లా రైతాంగానికి తీవ్ర నష్టం జరుగుతుందని ఆ జిల్లా కాంగ్రెస్ నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ అంశాన్ని జిల్లా మంత్రులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినట్టు మునుగోడు కాంగ్రెస్ నేత ఐలయ్య 'సాక్షి'కి తెలిపారు.

## మండలం యూనిట్‌గా యూరియా పంపిణీ!

హైదరాబాద్

రాష్ట్రంలో యూరియా పంపిణీ కోసం ప్రారంభించిన యాప్ సేవలను సులభతరం చేసేందుకు పలు మార్పులు చేయాలని వ్యవసాయ శాఖ నిర్ణయించింది. ప్రస్తుతం జిల్లా యూనిట్‌గా పంపిణీ ప్రక్రియ సాగుతుండగా.. ఆ స్థానంలో ఒకటి లేదా రెండేసి మండలాలను ఒక యూనిట్‌గా లేదా నియోజకవర్గం యూనిట్‌గా పంపిణీ చేసేందుకు సన్నాహాలు ప్రారంభించింది. యూరియా పంపిణీ సరిగా చేయని ప్రైవేటు డీలర్లపైనా నిఘా పెట్టింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాలకు అనుగుణంగా ఈ మేరకు చర్యలు చేపడుతున్నారు. యూరియా పంపిణీని సులభంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు ప్రత్యేక యాప్‌ను రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించింది. అయితే, దీని వినియోగంలో పలు జిల్లాల్లో సమస్యలు ఎదురవుతున్నాయి. సరిగా బుకింగ్ కాకపోవడం, స్లాట్‌లు ముగిసిపోవడం, దుకాణానికి వెళ్లేసరికే నిల్వలు నిండుకోవడం, ఇతరత్రా సమస్యలు ఎదురవుతున్నాయి. మంగళవారం కలెక్టర్ల సదస్సు సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి యూరియా యాప్ గురించి ప్రస్తావించారు. సులువుగా వినియోగించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ అధికారులు బుధ, గురువారాల్లో జిల్లాలవారీగా సమస్యలపై సమాచారం సేకరించి విశ్లేషణ చేశారు.

**జిల్లా యూనిట్‌గా ఉండడం వల్లే..**

ప్రస్తుతం యూరియా యాప్‌లో జిల్లా యూనిట్‌గా పంపిణీ జరుగుతోంది. రైతులు యాప్‌లో తమ జిల్లాల పరిధిలోని ఎరువుల దుకాణాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలలో యూరియా కోసం బుకింగ్ చేస్తున్నారు. దీంతో జిల్లా, నియోజకవర్గ, మండల కేంద్రాల్లో రద్దీ ఏర్పడుతోంది. ముందు వచ్చిన వారికే యూరియా దొరుకుతోంది. దీంతోపాటు నిల్వలపై ఎప్పటికప్పుడు తాజా సమాచారం నమోదు కావడం లేదు. ప్రైవేటు డీలర్లు కూడా యాప్ వినియోగానికి సహకరించడం లేదని తేలింది.

## ఎస్ఐఆర్‌కు వేగంగా కార్యాచరణ

-మొదటిపేజీ తరువాయి

అప్పగిస్తారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితా ప్రకారం 3.36 కోట్ల మంది ఉన్నారు. మూడో దశ కింద 17 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఎస్ఐఆర్ కోసం ఏప్రిల్ మొదటివారంలో నోటిఫికేషన్ వెలువడనుంది. ఈ ప్రక్రియ చేపట్టడానికి అవసరమైన ప్రీ ఎస్ఐఆర్ ర్యాండమ్ పరిశీలన కొనసాగుతోంది. రాష్ట్రంలో ఉన్న 3.36 కోట్ల మంది ఓటర్ల దగ్గరకు వెళ్లి పోలింగ్ కేంద్ర అధికారులు(బీఎల్ఓ)లు పరిశీలన జరుపనున్నారు. ప్రీ ఎస్ఐఆర్ కసరత్తులో భాగంగా జరుగుతున్న ఫీల్డ్ సర్వే వివరాలు వచ్చేనెల మూడవ వారం నుంచి మొదలయ్యే అసలు ప్రక్రియకు దోహదపడనుంది.

**నోటిఫికేషన్ వచ్చే నాటికి...**

ఎస్ఐఆర్ నోటిఫికేషన్ వెలువడే నాటికి ఎన్యూమరేటర్ ఫామ్‌ల ముద్రణ, బీఎల్ఓలకు కిట్‌ల తయారీ పూర్తి చేయాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి కసరత్తు చేస్తున్నారు. నిర్వాచన్ సదన్ నుంచి వచ్చే మార్గదర్శకాలు, ఆదేశాలకు అనుగుణంగా ఒక వారమంతా బీఎల్ఓలకు తుది దశ శిక్షణను ఇవ్వనున్నారు. బీఎల్‌వోలు పూర్తి చేసే ఎన్యుమరేటర్ ఫారాల్లో ఒకటి ఓటర్‌కు ఇవ్వడం, ఒకదాన్ని ఎన్నికల సంఘం తన వద్ద రికార్డు చేయనుంది. క్షేత్రస్థాయిలో తలెత్తే సమస్యలు, సందేహాలు, కొత్త గైడ్‌లైన్స్ మీద ఈసీ, సీఈఓ అధికారులు వాళ్లకు అవగాహన కల్పిస్తారు. రాష్ట్రవ్యాప్తంగా ఎన్యూమరేషన్ పూర్తై, తుది జాబితా వెలువడటానికి నాలుగు నెలలు పట్టే అవకాశం ఉందని అధికారవర్గాల సమాచారం.

**ఒక్కో పోలింగ్ కేంద్రంలో 350 ఓటర్లు..**

ఒక్కో పోలింగ్ కేంద్రం పరిధిలో 350 మంది ఓటర్ల వివరాలను బూత్ లెవెల్ ఆఫీసర్లు నమోదు చేయనున్నారు. ప్రతీ 10 మంది బీఎల్ఓలకు ఒక సూపర్‌వైజర్ ఉంటారు. రోజూ సేకరించిన సమాచారాన్ని ఓటర్లు ఎన్యూమరేషన్ ఫామ్‌లలో భర్తీ చేసిన తర్వాత ప్రత్యేక మొబైల్ యాప్ ద్వారా డిజిటల్ రూపంలోకి అప్‌లోడ్ చేస్తారు. మండలస్థాయిలో తహసీల్దారు అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్‌గా. ఈఆర్వోగా రెవెన్యూ డివిజన్ స్థాయిలో ఆర్డీవోలు ఉంటారు. జిల్లాస్థాయిలో ఎలక్షన్ ఆఫీసర్‌గా కలెక్టర్ వ్యవహరిస్తారు.

రాష్ట్రంలోని మొత్తం 37 వేల పోలింగ్ కేంద్రాల బీఎల్ఓలు, మరో 15 వేల మంది అసిస్టెంట్ బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు.. ఇలా దాదాపు 60 వేల మంది సిబ్బందిని స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ఐఆర్) ప్రక్రియలో పాల్గొననున్నారు. క్షేత్రస్థాయిలో బీఎల్ఓలు సేకరించిన వివరాల తర్వాత ఓటర్ల పేర్లు గల్లంతైనా, నమోదు కాకపోయినా, పేర్లతో పాటు అడ్రస్ గల్లంతు అయిన వారి ఫిర్యాదులు, అభ్యంతరాలు, అభిప్రాయాలను తీసుకుని పరిష్కరించడానికి నెల రోజుల గడువులోగా పూర్తి చేస్తారని సమాచారం, వాటన్నిటినీ పరిగణలోకి తీసుకొని పరిష్కరించిన తరువాతనే తుది జాబితా సిద్ధం చేస్తారు. ఈ ఏడాది సెపట?టంబరు నాటికల్లా ఓటరు జాబితా వెలువడే అవకాశం ఉంది. అర్హత కలిగినవాళ్ల పేర్లు జాబితాలో యధావిధిగా ఉంటాయని, సమగ్రమైన వివరాలు, నిర్దిష్టమైన ప్రూఫ్ లేనివాళ్లు మాత్రం లిస్టులో నుంచి తొలగిస్తారని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

## అప్పుడే భగభగలు..

-మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు. ఈ ఏడాది ఎండల తీవ్రత అధికంగా ఉండనున్నట్లు ఇప్పటికే భారత వాతావరణ శాఖ ఔట్‌లుక్ నివేదిక సూచించింది. ఈ వారంలో చాలా జిల్లాల్లో సాధారణం కన్నా 1 నుంచి 1.5 డిగ్రీల సెల్సియస్ వరకు ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు.

**మూడో వారం కంటే ముందే**

మార్చిలో సాధారణంగా మూడో వారం తరువాత ఎండల తీవ్రత పెరుగుతుంది. దీనికి భిన్నంగా ఈ ఏడాది మొదటి వారమే సూర్యుడు చుక్కలు చూపుతున్నాడు. మార్చి 20లోపు... గత పదేళ్లలో అత్యధికంగా 2022 మార్చి 18న నల్గొండలో 43.5, భద్రాచలంలో 42.8 డిగ్రీల సెల్సియస్ నమోదైంది.

**జాగ్రత్తలు తీసుకోవాలి**

ఎండల తీవ్రత నుంచి రక్షణకు జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ ప్రభుత్వానికి, ప్రజలకు సూచించింది. మధ్యాహ్నం పూట ఆరుబయటికి రాకుండా నీడపట్టున ఉండాలని, తగినంత నీరు తాగాలని పేర్కొంది. ఎండ తీవ్రతకు వృద్ధులు, చిన్నారులు, అనారోగ్యంతో ఉన్నవారు ప్రభావితమయ్యే అవకాశం ఉన్నందున చల్లని ప్రాంతాల్లో సేదతీరాలని తెలిపింది. నేడు ఆరెంజ్ హెచ్చరికలు ఉన్న జిల్లాలు (40 డిగ్రీలకు పైన ఉష్ణోగ్రతలు)
ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, ములుగు

**27 జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు (40 డిగ్రీల లోపు)**

పై 6 జిల్లాలు మినహా మిగిలిన 27 జిల్లాలకు శుక్రవారం అధికారులు ఎల్లో రంగు హెచ్చరికలు జారీచేశారు. వీటిలో మహబూబాబాద్, మంచిర్యాల, కుమురం భీం ఆసిఫాబాద్, జగిత్యాల, జోగులాంబ గద్వాల, వనపర్తి జిల్లాల్లో 39.5 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపారు.

## సింఘ్వీ, వేం ఎన్నిక ఏకగ్రీవమే!

-మొదటిపేజీ తరువాయి



అభ్యర్థులుగా ఎంపికైన అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి ఉదయం 10:30 గంటలకు మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి శాసనసభకు వచ్చి నామినేషన్లు దాఖలు చేశారు. మధ్యాహ్నం ఒంటిగంట ప్రాంతంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీకి రాగా ఆయనతో కలిసి వెళ్లి మరో సెట్ నామినేషన్ పత్రాలను ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి అందజేశారు. సింఘ్వీ మూడు సెట్ల నామినేషన్లు దాఖలు చేయగా వేం నరేందర్‌రెడ్డి నాలుగు సెట్లు దాఖలు చేశారు. మిత్రపక్షంగా ఉన్న ఎంఐఎం నుంచి నామినేషన్ల దాఖలు కార్యక్రమానికి హాజరైన ఎంఐఎం ఎమ్మెల్యేలు అహ్మద్ బిన్ బలాలా, జుల్ఫికర్ అలీ ఒక సెట్ నామిషన్ పత్రాలపై సంతకాలు చేశారు. ఊహించినట్లుగానే బీఆర్ఎస్ రాజ్యసభ బరిలో అభ్యర్థిని దించలేదు. రాజ్యసభ సభ్యత్వాన్ని పొందేందుకు అవసరమైన 40 మంది శాసనసభ్యుల బలం లేకపోవడంతో పోటీ చేయలేదని ఆ పార్టీ వర్గాలు తెలిపాయి.

**రెండోసారి రాజ్యసభకు అదృష్టం: సింఘ్వీ**

నామినేషన్ దాఖలు అనంతరం వేం నరేందర్‌రెడ్డితో కలిసి గాంధీ భవన్‌కు వచ్చిన అభిషేక్ మను సింఘ్వీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్‌గౌడ్‌ను కలిశారు. అనంతరం సింఘ్వీ తెలంగాణ తరపున రాజ్యసభకు రెండోసారి వెళ్లనుండటాన్ని అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. రెండోసారి తెలంగాణ నుంచి ఎంపీగా తనను ఎంపిక చేసిన కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్‌కు ధన్యవాదాలు తెలిపారు. వేం నరేందర్‌రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ నుంచి రాజ్యసభకు వెళ్లడం ఆనందంగా ఉందని.. ఇప్పటివరకు ఎలా పనిచేశానో, భవిష్యత్తులోనూ అలాగే పనిచేస్తానన్నారు. రాష్ట్రానికి రావాల్సిన హక్కులు, నిధుల కోసం పోరాడుతానని పేర్కొన్నారు. తనను రాజ్యసభకు ఎంపిక చేసిన రేవంత్‌రెడ్డి, మహేశ్‌గౌడ్‌కు ధన్యవాదాలు తెలిపారు. కాగా, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క కుమారుడి పెళ్లికి హాజరయ్యేందుకు హైదరాబాద్ వచ్చిన పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డిలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు.

# దద్దరిల్లిన పశ్చిమాసియా

-మొదటిపేజీ తరువాయి

దానికి తప్పకుండా చింతిస్తుందని, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రక్తం కళ్లచూస్తామని హెచ్చరించింది. యుద్ధం కారణంగా 5 రోజులుగా మూతపడ్డ పశ్చిమాసియాలోని విమానాశ్రయాలు ఇప్పుడిప్పుడే తెరుచుకుంటున్నాయి. ప్రత్యేక విమానాల ద్వారా అక్కడ చిక్కుకుపోయిన వారిని తరలిస్తున్నారు. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 8 మంది మరణించారు. పాలస్తీనా శరణార్థుల బెదావీ శిబిరంతోపాటు తీర ప్రాంత హైవేపై మూడు చోట్ల దాడులు జరిగాయి. మరోవైపు హెజ్‌బొల్లా చీఫ్ నయీం ఖాసిం తొలిసారిగా ఇజ్రాయెల్ దాడులపై స్పందించారు. ఆయుధాలను వదిలేయాలన్న లెబనాన్ ప్రభుత్వ ప్రతిపాదనను తిరస్కరించారు. ఇజ్రాయెల్ దాడులు చేసినంత కాలం ప్రతిఘటిస్తూనే ఉంటామని స్పష్టం చేశారు.
ఖియాం గ్రామంలో ఇజ్రాయెల్ దళాలపై దాడి చేస్తున్న దృశ్యాలను హెజ్‌బొల్లా విడుదల చేసింది.
ఇరాన్ రాజధాని టెహ్రాన్ తూర్పు, పశ్చిమ ప్రాంతాల్లో పేలుడు శబ్దాలు వినిపించాయి. కరాజ్ ప్రాంతమూ బాంబుల మోతతో దద్దరిల్లింది. నగరంలోని పలు మౌలిక వసతులపైనా దాడులు జరిగాయి.
లెబనాన్‌లో ఇప్పటిదాకా 102 మంది మరణించారు. 83,000 మంది నిరాశ్రయులయ్యారు.

**174 నగరాలపై దాడులు**

ఇప్పటిదాకా ఇరాన్‌లోని 174 నగరాలపై అమెరికా-ఇజ్రాయెల్ దాడులు చేశాయని రెడ్ క్రెసెంట్ సొసైటీ వెల్లడించింది. మొత్తం 636 ప్రాంతాలపై 1,332 దాడులు చేశాయని వివరించింది. పలు నగరాల్లో నివాస భవనాలనూ లక్ష్యంగా చేసుకున్నాయని తెలిపింది.

**దాడులను విస్తరించిన ఇరాన్**

అజర్‌బైజాన్‌లోని నక్షివాన్ విమానాశ్రయంపై ఇరాన్ డ్రోన్ దాడి చేసింది. అది విమానాశ్రయ సమీపంలో కూలిపోయింది. మరో డ్రోన్ పాఠశాలవద్ద పడింది. దీంతో ఇద్దరు గాయపడ్డారు. అయితే తాము అజర్‌బైజాన్‌ను లక్ష్యంగా చేసుకోలేదని ఇరాన్ అంటోంది. బహ్రెయిన్‌లోని ప్రభుత్వరంగ చమురు శుద్ధి కేంద్రంపై ఇరాన్ దాడులు చేసింది. అయితే ఎలాంటి నష్టం జరగలేదని బహ్రెయిన్ వెల్లడించింది.
ముందు జాగ్రత్త చర్యగా దోహాలోని అమెరికా ఎంబసీ సమీపంలో ఉంటున్న ప్రజలను ఖతార్ ఖాళీ చేయించింది. నగరంపై క్షిపణి దాడి జరిగింది.
తమ అల్-జాఫ్ ప్రావిన్సులోకి దూసుకొచ్చిన డ్రోన్‌ను కూల్చివేశామని సౌదీ అరేబియా వెల్లడించింది.
అబుధాబీలో ఉన్న అల్ ధఫ్రా అమెరికా వైమానిక స్థావరంపై డ్రోన్ దాడి జరిగింది. ఈ దాడి కారణంగా శిథిలాలు పడి ఆరుగురు గాయపడ్డారు.
కువైట్ తీరంలో ఓ నౌకపై దాడి జరిగింది.
మూడు విడతలుగా తమ దేశంపై ప్రయోగించిన క్షిపణులను అడ్డుకున్నామని ఇజ్రాయెల్ ప్రకటించింది.
ఇరాన్‌కు మద్దతుగా ఇర్బిల్‌లోని అమెరికా స్థావరాలు, కాన్సులేట్‌పై మిలిటెంట్లు క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేశారు. వీటిలో చాలావాటిని అమెరికా బలగాలు అడ్డుకున్నాయి. కొన్ని నివాస భవనాలపై పడ్డాయి. యుద్ధం మొదలైనప్పటి నుంచి 100 దాడులు జరిగాయని ఇర్బిల్ గవర్నర్ ఓమెద్ ఖోష్నా తెలిపారు.
పర్షియన్ గల్ఫ్‌లోని యూఎస్ ట్యాంకర్‌పై క్షిపణితో దాడి చేశామని ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కోర్ ప్రకటించింది. నౌక నుంచి భారీ ఎత్తున మంటలు ఎగిసిపడుతున్నట్లు వెల్లడించింది. ప్రాణ నష్టానికి సంబంధించిన వివరాలు ఇంకా తెలియరాలేదు. తమ యుద్ధ నౌకపై దాడికి ప్రతిస్పందనగానే దాడి జరిగిందని ఇరాన్ అధికారులు పేర్కొన్నారు.
యూఏఈలోని భారతీయులు జాగ్రత్తగా ఉండాలని భారత్ హెచ్చరికలు జారీచేసింది. స్థానిక ప్రభుత్వ నిబంధనలను పాటించాలని, అక్కడ చిక్కుకున్నవారు సంబంధిత విమానయాన సంస్థలను సంప్రదించాలని కోరింది. ఖమేనీ కుమారుడిని అంగీకరించం: ట్రంప్
ఇరాన్‌పై యుద్ధం విషయంలో తనకు 10కి 15 మార్కులు ఇచ్చుకుంటానని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించుకున్నారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఎన్నికకు సహకరిస్తానని, అయితే ఖమేనీ కుమారుడిని అంగీకరించబోనని స్పష్టం చేశారు.
పశ్చిమాసియాలో మరిన్ని యుద్ధ విమానాలను మోహరిస్తున్నామని బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్ తెలిపారు. తమ స్థావరాల భద్రత కోసం వీటిని వినియోగిస్తామని వివరించారు.
యుద్ధం కారణంగా తొలి రెండు రోజుల్లో లక్ష మంది టెహ్రాన్ వదిలేశారని ఐరాస వెల్లడించింది. రోజుకు 2వేల వాహనాల ద్వారాతరలివెళ్తున్నారని వివరించింది.
యుద్ధంలో తమ స్థావరాలను ఉపయోగించుకోవడానికి స్పెయిన్ అనుమతించిందని అమెరికా ప్రకటించడాన్ని ఆ దేశం తప్పుబట్టింది. ఇరాన్ యుద్ధాన్ని ఆపేందుకు కాంగ్రెస్‌లో జరిగిన ప్రయత్నాన్ని సెనెట్ రిపబ్లికన్లు అడ్డుకున్నారు. యుద్ధ అధికారాల తీర్మానాన్ని 47-53ఓట్లతో సెనెట్ తిరస్కరించింది. ట్రంప్‌నకు రిపబ్లికన్లు ముందస్తు మద్దతు ప్రకటించారు. ఉద్రిక్తతలు తగ్గాలని కెనడా, ఆస్ట్రేలియా ప్రధానులు మార్క్ కార్నీ, ఆంథోనీ ఆల్బనీస్‌లు విజ్ఞప్తి చేశారు. ఇరాన్‌వద్ద అణ్వాయుధం ఉండకూడదని స్పష్టం చేశారు. తమకు మద్దతుగా ఇరాన్‌పై యుద్ధం చేయాలని కుర్దిష్ ఇరానియన్ అసమ్మతి గ్రూపును అమెరికా కోరింది. ఇప్పటికే కుర్దిష్ మిలిటెంట్లు ఇరాన్ సరిహద్దుల్లో మోహరించి ఉన్నారు.
దాడుల కారణంగా ఇప్పటిదాకా ఇరాన్‌లో 1,230 మంది మరణించారు.
యుద్ధంలో సైనిక సాయం చేయాల్సిందిగా ఇరాన్ తమను కోరలేదని రష్యా వెల్లడించింది.
ఇరాన్‌పై దాడులు చేయడానికి అమెరికా తమ నౌకాశ్రయాలను వాడుకుంటోందంటూ వస్తున్న వార్తలను భారత్ తీవ్రంగా ఖండించింది.
ఇరాన్ సుప్రీం లీడర్‌గా ఇంకా ఎవరినీ ఎన్నుకోలేదని తెలుస్తోంది. ఇంకా ఆ ప్రక్రియ కొనసాగుతోందని భారత్‌లో సుప్రీం లీడర్ ప్రతినిధి ఆయతుల్లా డాక్టర్ అబ్దుల్ మజీద్ హకీమెలాహీ వెల్లడించారు.
అమెరికాది దారుణ నేరం: అరాగ్చీ
ఐరిస్ దేనా-75 నౌకను ముంచడం ద్వారా అమెరికా దారుణ నేరానికి పాల్పడిందని ఇరాన్ విదేశాంగశాఖ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వ్యాఖ్యానించారు. 'నా మాటలను గుర్తుంచుకోండి. అమెరికా త్వరలోనే ఘోరంగా చింతించాల్సి వస్తుంది' అని స్పష్టం చేశారు.
'యూదుల రక్తం చిందించండి.. ట్రంప్ రక్తం చిందించండి' అంటూ ఇరాన్ మతాధికారి ఆయతుల్లా అబ్దుల్లా జావాదీ అమోలీ పిలుపునిచ్చారు. ఇలా ఒక మతాధికారి హింసకు పిలుపునివ్వడం బహు అరుదు.

**'ఇరాన్ దాడులు తగ్గాయ్'**

ఇరాన్ నుంచి క్షిపణులు, డ్రోన్ల ప్రయోగాలు తగ్గాయని అమెరికా, ఇజ్రాయెల్ సైనికాధికారులు తెలిపారు. బాలిస్టిక్ క్షిపణులు, లాంఛర్లు, డ్రోన్లు తగ్గిపోయాయని వెల్లడించారు. ఈ నేపథ్యంలో దేశమంతా నిబంధనలను కొంత సడలిస్తున్నామని ప్రకటించారు.

**తెరుచుకున్న ఇజ్రాయెల్ గగనతలం**

ఇజ్రాయెల్ గగనతలాన్ని గురువారం పరిమితంగా తెరిచారు. గంటకు ఒక విమానాన్ని అనుమతించారు. అదీ ఇజ్రాయెల్‌కు వచ్చే వాటినే అనుమతించారు. మొత్తంగా 5,000 మందిని తీసుకొచ్చారు. బయటకు వెళ్లే విమానాలను అనుమతించడం లేదు.
ఒమన్ రాజధాని మస్కట్ నుంచి తమ విమానాలను నడుపుతామని ఖతార్ ప్రకటించింది. అక్కడి నుంచి ఆమ్‌స్టర్‌డాం, బెర్లిన్, కోపెన్‌హాగన్, లండన్, మద్రిద్, రోమ్‌లకు నడుపుతామని వెల్లడించింది. గురువారం కొన్ని విమానాలను ఆ సంస్థ నడిపింది. ఖతార్ గగనతలం మూసే ఉంది.
యుద్ధం కారణంగా తమ దేశంలో చిక్కుకుపోయిన వారికి వీసా గడువును పొడిగిస్తామని ఇండోనేసియా ప్రకటించింది. బాలి నుంచి దుబాయ్, దోహా, అబుధాబీలకు వెళ్లాల్సిన 6,000 మంది ఉన్నారని వివరించింది.

**గల్ఫ్‌పై దాడులు ఆపండి..**

గల్ఫ్ దేశాలపై దాడులను ఆపాలని ఇరాన్‌ను అరబ్ లీగ్ అధ్యక్షుడు అహ్మద్ అబౌల్ ఘీత్ కోరారు. ఇరాన్ చర్య వ్యూహాత్మక తప్పిదమని స్పష్టం చేశారు. ఆ దేశం తన విచక్షణను ఉపయోగించాలని సూచించారు. అరబ్ లీగ్‌లో 22 దేశాలున్నాయి.
ఒమన్‌వద్ద సోమవారం నౌకపై జరిగిన దాడిలో మరణించిన వారిలో బిహార్‌కు చెందిన కెప్టెన్ ఆశిష్ కుమార్, ముంబయికి చెందిన దీక్షిత్ సోలంకీ ఉన్నారు. రాజస్థాన్‌కు చెందిన దలీప్ సింగ్ ఆచూకీ తెలియడం లేదు.

**భారత్, చైనా నౌకలకు అనుమతి!**

ఇరాన్ హెచ్చరికలతో వందలాది నౌకలు హర్మూజ్ సముద్ర మార్గంలోనే నిలిచిపోయినట్లు అంచనా. ఈ నౌకల్లో దాదాపు 23వేల మంది భారత సిబ్బంది ఉన్నట్లు అంచనా.
అమెరికా, ఇజ్రాయెల్, ఐరోపాతోపాటు వాటికి మద్దతు పలికే దేశాల నౌకలను హర్మూజ్ మీదుగా అనుమతించేది లేదని ఐఆర్‌జీసీ స్పష్టంచేసింది. భారత్, చైనా నౌకలకు అనుమతిచ్చినట్లు సమాచారం.

**ఖమేనీ మృతికి భారత్ సంతాపం**

దిల్లీ: ఇరాన్ సుప్రీం లీడర్ ఆయతుల్లా అలీ ఖమేనీ మృతికి భారత్ సంతాపం తెలిపింది. గురువారం దిల్లీలోని ఇరాన్ ఎంబసీకి వెళ్లిన విదేశాంగశాఖ కార్యదర్శి విక్రం మిస్రీ సంతాప సందేశంపై భారత్ తరఫున సంతకం చేశారు. 'భారత ప్రభుత్వం, ప్రజల తరఫున ఖమేనీ మృతికి తీవ్ర సంతాపం తెలుపుతున్నాం. ఆయన ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటున్నాం' అని సంతాప సందేశంలో రాశారు. ఇరాన్ రాయబారి మహమ్మద్ ఫతాలీతో మిస్రీ కొంత సేపు మాట్లాడారు. ఖమేనీ మరణించిన 6 రోజుల తర్వాత భారత్ ఆయన మృతికి సంతాపం తెలపడం గమనార్హం. విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్.. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీకి ఫోన్ చేసి మాట్లాడారు. పశ్చిమాసియాలో పరిస్థితులపై చర్చించారు. ఖమేనీపై దాడి చేసి చంపేయడం, హిందూ మహా సముద్రంలో ఇరాన్ యుద్ధ నౌకను అమెరికా ముంచేయడంపై ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడాన్ని ప్రతిపక్షాలు తప్పుబట్టాయి. ఈ నేపథ్యంలో ప్రభుత్వం స్పందించింది.

# భారత ప్రభుత్వం ఎన్నడూ ఇంత పిరికిగా వ్యవహరించలేదు

పశ్చిమాసియా సైనిక ఘర్షణ చివరకు భారత్ పొరుగుదేశం దాకా చేరుకుందని, అయినా ప్రధాని మోదీ మౌనంగా ఉండటాన్ని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తప్పుపట్టారు. శ్రీలంక సమీపంలోని హిందూ మహాసముద్రంలో ఇరాన్‌కు చెందిన ఐఆర్ఐఎస్ దేనా యుద్ధనౌకను అమెరికా జలాంతర్గామి ముంచేసినా మోదీ మాట్లాడకపోవడం సరికాదన్నారు. ఈమేరకు గురువారం ఆయన ఒక ట్వీట్ చేశారు. ఈ క్లిష్ట పరిస్థితుల్లో మన దేశం తరఫున ధైర్యంగా నిలువగలిగే, మాట్లాడగలిగే నాయకుడు కావాలని రాహుల్ పేర్కొన్నారు. కానీ భారతదేశ వ్యూహాత్మక స్వతంత్రతను ప్రధాని మోదీ ఇతర దేశాలకు సరెండర్ చేసి రాజీకి వచ్చారని మండిపడ్డారు.
ఇరాన్ నౌకను అమెరికా ముంచేసిన అంశంపై ఇప్పటిదాకా భారత ప్రధాని ఒక్కమాట కూడా మాట్లాడలేదన్నారు. గల్ఫ్ ప్రాంతంలో జరుగుతున్న సైనిక ఘర్షణ వల్ల భారత్‌కు జరిగే ముడి చమురు సప్లైలకూ ముప్పు ఉంటుందని ఆయన పేర్కొన్నారు. భారత్ వినియోగించే ముడి చమురులో 40 శాతానికిపైగా ఇరాన్‌కు చెందిన హార్ముజ్ జలసంధి మీదుగానే వస్తుంటుందని గుర్తుచేశారు. ఈ పరిణామాలు ముడి చమురు, సహజ వాయువు విభాగాలపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని రాహుల్ హెచ్చరించారు. ప్రస్తుతం యావత్ ప్రపంచం అనిశ్చితిలో ఉందని, రాబోయేది కష్టకాలమని ఆయన వ్యాఖ్యానించారు.

**భారత ప్రభుత్వం ఎన్నడూ ఇంత పిరికిగా వ్యవహరించలేదు**

భారత ప్రభుత్వం గతంలో ఎన్నడూ ఇంత పిరికిగా, భయంగా వ్యవహరించలేదని కాంగ్రెస్ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ విమర్శించారు. శ్రీలంక తీరంలో ఇరాన్ యుద్ధనౌకను అమెరికా ముంచేసిన ఘటనపై మాట్లాడేందుకూ ప్రధాని మోదీ సాహసించడం లేదని ఆయన మండిపడ్డారు. ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీని అమెరికా హత్య చేసిన ఘటనపై స్పందించని మోదీ, ఇరాన్ యుద్ధ నౌక ఘటనపై మాట్లాడకపోవడంలో పెద్ద విడ్డూరమేం లేదన్నారు. ఈమేరకు జైరామ్ రమేశ్ ఒక ట్వీట్ చేశారు. భారత నౌకాదళం మిలన్ సైనిక విన్యాసాలు తొలిసారిగా 1995లో జరిగాయని, 13వసారి ఈ కార్యక్రమాన్ని 2026 ఫిబ్రవరి 19 నుంచి 25 వరకు విశాఖపట్నంలో నిర్వహించారని ఆయన చెప్పారు. ఈ విన్యాసాలను స్వయంగా భారత రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమెరికా, ఇరాన్ సహా 18 దేశాల యుద్ధనౌకలు పాల్గొన్నాయన్నారు. విశాఖపట్నం నుంచి స్వదేశానికి తిరిగి వెళ్తున్న ఇరాన్ యుద్ధ నౌకను మార్చి 4న శ్రీలంక సమీపంలో అమెరికా ముంచేయడాన్ని జైరామ్ రమేశ్ ఖండించారు. దీనిపై ఇప్పటిదాకా భారత్ ఎలాంటి అధికారిక ప్రకటనను విడుదల చేయకపోవడం దారుణమన్నారు.

# భారత్‌కు ఎలాంటి సమయంలోనైనా చమురు సరఫరా చేయడానికి మేం సిద్ధం

పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం కొనసాగుతున్న వేళ, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళనల నడుమ రష్యా కీలక ప్రకటన చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి పరిస్థితులు నెలకొన్నప్పటికీ, భారత్‌కు ముడి చమురు సరఫరా చేసేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉన్నామని భారత్‌లోని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. హార్ముజ్ జలసంధి మూసివేత భయాలు, తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నేడు న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన అలిపోవ్.. చమురు సరఫరాదారులు ఎవరనేది నిర్ణయించుకోవాల్సింది భారత నాయకత్వమేని, అయితే రష్యా మాత్రం భారత్‌కు ఆయిల్ ఇచ్చేందుకు ఎప్పుడూ సానుకూలంగానే ఉంటుందని భరోసా ఇచ్చారు. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న ఘర్షణలపై స్పందిస్తూ, సమస్య ఏదైనా చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని అలిపోవ్ అభిప్రాయపడ్డారు. వీలైనంత త్వరగా ఈ ఘర్షణలకు ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సమయంలో యుద్ధం ఇంకెంత కాలం కొనసాగుతుందని విలేకరులు ప్రశ్నించగా.. "ఆ విషయం నాకేం తెలుసు? ఈ ప్రశ్నకు సమాధానం నాకంటే అమెరికాకే బాగా తెలుసు" అని ఆయన వ్యంగ్యంగా బదులిచ్చారు. మరోవైపు, ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సాయుధ దాడులను రష్యా తీవ్రంగా ఖండించింది. పరిస్థితిని తిరిగి రాజకీయ, దౌత్యపరమైన పరిష్కార మార్గంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. ఈ మేరకు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్, ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీతో శనివారం ఫోన్లో మాట్లాడారు. ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన శాంతియుత చర్చలకు విఘాతం కలిగించేలా అమెరికా, ఇజ్రాయెల్ వ్యవహరించాయని, వారి దుందుడుకు చర్యలను అడ్డుకునేందుకు ఇరాన్ నాయకత్వం తీసుకుంటున్న చర్యలను అరాఘ్చీ వివరించారు. ఈ అంశంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశాన్ని అత్యవసరంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన రష్యా విదేశాంగ మంత్రి లావ్‌రోవ్.. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు అంతర్జాతీయ చట్టాల సూత్రాలకు, నిబంధనలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వానికి ఇవి తీవ్ర ముప్పు అని, పర్యవసానాలను పూర్తిగా విస్మరించి దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇరాన్‌పై దాడులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పరస్పర గౌరవం, అంతర్జాతీయ చట్టాల ఆధారంగా శాంతియుత పరిష్కారాల కోసం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా కృషి చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందని లావ్‌రోవ్ హామీ ఇచ్చారు. ఇటీవల ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను, సైనిక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేయడంతో పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీతో సహా పలువురు అగ్రనాయకులు మరణించడంతో పరిస్థితి మరింత దిగజారింది. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా డ్రోన్, క్షిపణి దాడులతో అమెరికా స్థావరాలు, మిత్రపక్షాల బలగాలపై విరుచుకుపడుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా రాయబారి చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## తొలిసారిగా డిజిటల్ జనగణన

న్యూఢిల్లీ

దేశ చరిత్రలో మునుపెన్నడూ లేని విధంగా ప్రతిష్టాత్మక జనాభా లెక్కల (సెన్సస్--2027) సేకరణకు కేంద్రం సిద్ధమైంది. ప్రపంచంలోనే అతిపెద్ద ఎన్యుమరేషన్ ప్రక్రియను తొలిసారిగా పూర్తిగా డిజిటల్ పద్ధతిలో నిర్వహించనుంది. ఇందుకోసం రూపొందించిన నాలుగు అత్యాధునిక డిజిటల్ యాప్‌లు, పోర్టల్స్‌తో పాటు 'ప్రగతి', 'వికాస్'అనే మస్కట్‌లను కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఢిల్లీలో గురువారం లాంఛనంగా ఆవిష్కరించారు.

**టెక్నాలజీతో సులభంగా ఇంటింటి సర్వే**

సుమారు 30 లక్షల మంది సిబ్బందితో ఈ బృహత్తర కార్యక్రమాన్ని కేంద్రం చేపట్టనుంది. కాగితాలతో పనిలేకుండా, సీ--డాక్ ఆధ్వర్యంలో రూపొందించిన యాప్‌ల ద్వారా ఆఫ్‌లైన్‌లోనూ సిబ్బంది డేటాను సేకరిస్తారు. ఈసారి ప్రజలకు 'సెల్ఫ్ ఎన్యుమరేషన్'(స్వీయ నమోదు) సౌకర్యాన్ని కల్పిస్తున్నారు. ఎన్యుమరేటర్ ఇంటికి రాకముందే, ప్రజలు తమ స్మార్ట్ ఫోన్ల ద్వారా 16 ప్రాంతీయ భాషల్లో కుటుంబ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చు. ఇలా చేయగానే వచ్చే ప్రత్యేక ఐడీని సిబ్బందికి చూపిస్తే సరిపోతుంది.

**ఆకర్షణీయంగా 'ప్రగతి', 'వికాస్':**

జనగణన ప్రక్రియలో స్త్రీ, పురుషుల సమాన భాగస్వామ్యానికి ప్రతీకగా మహిళా ఎన్యుమరేటర్‌ను 'ప్రగతి'గా, పురుష ఎన్యుమరేటర్‌ను 'వికాస్'గా నామకరణం చేస్తూ మస్కట్‌లను విడుదల చేశారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష్యాన్ని ఇవి ప్రతిబింబిస్తాయని ప్రభుత్వం తెలిపింది.

**నాలుగు కీలక సాధనాలు ఇవే.. :**

హౌస్‌లిస్టింగ్ వెబ్ యాప్: శాటిలైట్ మ్యాప్‌ల ద్వారా భౌగోళికంగా డిజిటల్ బ్లాక్‌ల రూపకల్పనకు ఇది ఉపయోగపడుతుంది.
హెచ్‌ఎల్‌ఓ యాప్: ఎన్యుమరేటర్లు నేరుగా డేటాను సర్వర్‌కు పంపేందుకు ఈ ఆఫ్‌లైన్ మొబైల్ యాప్ ఉపకరిస్తుంది.
స్వీయ నమోదు పోర్టల్ (ఎస్ఈ పోర్టల్ ): ప్రజలు నేరుగా తమ వివరాలు నమోదు చేసుకునే వెబ్‌సైట్.
సెన్సస్ మేనేజ్‌మెంట్ సిస్టమ్: అధికారులంతా ఎప్పటికప్పుడు సర్వే పురోగతిని పర్యవేక్షించే రియల్--టైం డ్యాష్‌బోర్డ్.

**రెండు దశల్లో సెన్సస్.. కులగణన కూడా :**

జనగణన ప్రక్రియ రెండు దశల్లో జరగనుంది. ఇళ్ల వివరాలు సేకరించే మొదటి దశ (హౌస్ లిస్టింగ్) 2026 ఏప్రిల్ 1 నుంచి సెపట?టంబర్ 30 మధ్య రాష్ట్రాల వెసులుబాటును బట్టి 30 రోజుల పాటు జరుగుతుంది. వ్యక్తుల వివరాలు సేకరించే రెండో దశ (జనాభా లెక్కింపు) 2027 ఫిబ్రవరిలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తారు. విశేషమేమిటంటే, ఈ రెండో దశలోనే కులగణన వివరాలు కూడా సేకరిస్తారు. ఈ జనాభా లెక్కలకు 2027 మార్చి 1వ తేదీని ప్రామాణిక తేదీగా నిర్ణయించారు. మంచు ప్రభావం ఉండే ప్రాంతాల్లో (లద్దాఖ్, జమ్మూకశ?మర్, హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్) మాత్రం 2026 సెపట?టంబర్‌కల్లా ఈ సర్వేను పూర్తి చేస్తారు.

## రాజ్యసభకు నితీశ్ నామినేషన్

పట్నా

బిహార్ ముఖ్యమంత్రి నితీశ్ కుమార్, బీజేపీ చీఫ్ నితిన్ నబీన్ సహా ఐదుగురు గురువారం ఎన్డీయే తరఫున రాజ్యసభ అభ్యర్థులుగా నామినేషన్లు వేశారు. జేడీయూ చీఫ్‌గా ఉన్న నితీశ్ కుమార్, జనవరిలో బీజేపీ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టిన నబీన్‌లు ఢిల్లీ నుంచి వచ్చిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమక్షంలో విధాన సభ సెక్రటేరియట్‌లో అధికారులకు నామినేషన్ పత్రాలను సమర్పించారు. నామినేషన్లు వేసిన ఎన్డీయే అభ్యర్థుల్లో జేడీయూకు చెందిన కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్, ఆర్ఎల్ఎం చీఫ్ ఉపేంద్ర కుష్వాహ, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివేశ్ కుమార్ ఉన్నారు. వీరితోపాటు ఆర్జేడీ బలపరిచిన సిట్టింగ్ ఎంపీ, వ్యాపారవేత్త అమరేంద్ర ధారి సింగ్ సైతం నామినేషన్ వేశారు. ఆయన వెంట ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ ఉన్నారు.

**డిప్యూటీ సీఎంగా నిశాంత్**

సీఎం నితీశ్ కుమారుడు నిశాంత్ కుమార్ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తున్నట్లుగా వార్తలు గుప్పుమన్న రెండు రోజుల్లోనే నితీశ్ రాజ్యసభకు నామినేషన్ వేయడం గమనార్హం. నితీశ్ కుమార్ రాజీనామాతో సీఎం పదవిని బీజేపీ నేత చేపడతారని భావిస్తున్నారు. అదేవిధంగా, ఇంజనీరింగ్ పట్టభద్రుడైన 40 ఏళ్ల నిశాంత్ కొత్త ప్రభుత్వంలో డిప్యూటీ సీఎంగా చేరుతారని అంటున్నారు. సీఎం రేసులో ఉన్న వారిలో ప్రస్తుత డిప్యూటీ సీఎం సమ్రాట్ చౌదరి పేరు గట్టిగా వినిపిస్తోంది.

**నితీశ్ నివాసం వద్ద నిరసనలు..**

గతేడాది నవంబర్‌లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్డీయేను అఖండ విజయం వైపు నడిపించిన నితీశ్ రాజీనామాతో బీజేపీ నేత ఒకరు ఆ పదవిని చేపట్టే అవకాశం ఉంది. ఇప్పటివరకు ఆ పార్టీ అభ్యర్థి సీఎం పదవిని చేపట్టని ఏకైక హిందీ రాష్ట్రం బిహార్. అయితే, నితీశ్ నిర్ణయాన్ని నిరసిస్తూ జేడీయూ కార్యకర్తలు ఆయన నివాసం వద్దకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. 'రాష్ట్ర రాజకీయాలను వదిలి రాజ్యసభకు వెళ్లా లని నితీష్ తీసుకున్న నిర్ణయం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఆయన నిర్ణయంపై పార్టీ కార్యకర్తలు సంతోషంగా లేరు. ఆయన సీఎంగా కొనసాగాలి' అని రాష్ట్ర సున్నీ వక్ఫ్ బోర్డు చైర్మన్, జేడీ(యూ) నేత అల్హాజ్ మొహమ్మద్ ఇర్షాదుల్లా అన్నారు. నితీశ్ ట్వీట్ చూడగానే ఆయన రాసింది కాదని తేలిపోయింది. అది ఢిల్లీ నుంచి వచ్చిన ఆదేశమని అర్థ మైందని ఆర్జేడీ మరో నేత మనోజ్ ఝా వ్యాఖ్యానించారు.

**నితీశ్ స్వచ్ఛంద నిర్ణయం.**

బిహార్‌లో చోటుచేసుకున్న ఆకస్మిక పరిణామంపై కేంద్ర మంత్రి గిరిరాజ్ కిశోర్ స్పందించారు. "రాజ్యసభకు వెళ్లాలనుకుంటున్నట్లు నితీశ్ మూడేళ్ల క్రితమే తెలిపారు. ఇప్పుడు ఆయన ఆమేరకు నిర్ణయం తీసుకున్నారు. ఆయన స్వచ్ఛందంగా తీసుకున్న నిర్ణయమిది. భవిష్యత్తులో ఏ ప్రభుత్వం ఏర్పడినా అది ఆయన నాయకత్వంలోనే ఉంటుంది'అని తెలిపారు.

**ఆ ఒక్క సీటు ఆర్జేడీకి దక్కుతుందా?**

ప్రస్తుతం బిహార్‌లో ఎన్నికలు జరుగుతున్న ఐదు రాజ్యసభ స్థానాలకు గాను రెండు ఆర్జేడీకి చెందినవే. 2025 ఎన్నికల్లో ఆ పార్టీకి 25 అసెంబ్లీ సీట్లు మాత్రమే దక్కడంతో ప్రస్తుతం కేవలం ఒక్క స్థానానికి మాత్రమే పోటీ చేస్తోంది. ఆర్జేడీకి మహాగఠ్ బంధన్‌లోని మరో 10 మంది సభ్యులు ఇప్పటికే మద్దతు తెలిపారు. ఎంఐఎం, బీఎస్పీలకు చెందిన మరో ఆరుగురు మద్దతిస్తే ఒక్క రాజ్యసభ సీటు గ్యారంటీగా దక్కుతుంది. అయితే, మద్దతుపై ఎంఐఎం, బీఎస్పీ చీఫ్‌లు ఇప్పటి వరకు ఎవ్వరికీ మద్దతు ప్రకటించలేదు. అదే సమయంలో, ఎన్డీయేకి 243 మందితో కూడిన అసెంబ్లీలో ఏకంగా 202 మంది ఉన్నారు. దీంతో, ఐదో సీటును దక్కించుకోవాలంటే కేవలం ముగ్గురు ఎమ్మెల్యేలు మాత్రం అవసరమవుతారు. ఆ మేరకు మద్దతును కూడగట్టడం ఎన్డీయేకు ఏమంత కష్టం కాదని పరిశీలకులు అంటున్నారు.

**రాజ్యసభకు వెళ్తున్నా..**

నామినేషన్ దాఖలు చేయడానికి ముందు, సీఎం నితీశ్ కుమార్ తాను రాజ్యసభకు వెళ్లాలనుకుంటున్నట్లు ప్రకటించారు. దీంతో, బిహార్‌కు అత్యధికంగా 20 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఆయన సుదీర్ఘ ప్రస్థానానికి తెరపడినట్లయింది. అనంతరం ఆయన 'ఎక్స్'లో రాష్ట్రంలో ఏర్పడే కొత్త ప్రభుత్వానికి తన పూర్తి సహకారం ఉంటుందని తెలిపారు. 'రెండు దశాబ్దాలకు పైగా, మీరు నాపై నమ్మకం ఉంచారు. మద్దతిచ్చారు. ఆ బలంతోనే అంకితభావంతో సేవ చేశాను. మీ నమ్మకం, మద్దతు బిహార్ అభివృద్ధికి, రాష్ట్రానికి గౌరవాన్ని తీసుకురావడానికి అవకాశం కల్పించింది. రాష్ట్రంలో ఉభయసభలతోపాటు పార్లమెంటు ఉభయ సభలలో సభ్యుడిగా ఉండాలన్నది నా కోరిక. అందుకనుగుణంగా ఈసారి జరుగుతున్న ఎన్నికల్లో రాజ్యసభ సభ్యునిగా ప్రయాణం ప్రారంభించాలనుకుంటున్నా' అని ఎక్స్ వేదికగా ఆయన ప్రకటించారు. భవిష్యత్‌లోనూ రాష్ట్రంతో అనుబంధం కొనసాగుతుందన్నారు. కొత్త ప్రభుత్వానికి తన పూర్తి సహకారం, మార్గదర్శకత్వం ఉంటుందని పేర్కొన్నారు.

## సంపాదకీయం

# ఎర్ర జెండా నీడలో అవిశ్రాంత పోరాటం

భారతదేశ రాజకీయ చరిత్రలో సాయుధ ఉద్యమం ఒక విభిన్న అధ్యాయంగా నిలిచింది. ఆ అధ్యాయానికి ప్రతీకగా మారిన పేరు ముప్పాళ లక్ష్మణ్ రావు, "గణపతి"గా ప్రసిద్ధి పొందిన వ్యక్తి. ఇటీవల వెలువడుతున్న లొంగుబాటు వార్తల నేపథ్యంలో ఆయన జీవితం, ఉద్యమ ప్రయాణం, దేశ రాజకీయ?సామాజిక పరిణామాలపై వాటి ప్రభావం మళ్లీ చర్చకు వచ్చింది. ఒక వ్యక్తి నిర్ణయం వెనుక దాగి ఉన్న దశాబ్దాల చరిత్రను, పూర్వాపరాలను, గణాంకాలను సమగ్రంగా పరిశీలించడం అవసరం. 1967లో పశ్చిమ బెంగాల్‌లోని నక్సల్బరి గ్రామంలో రైతుల తిరుగుబాటు భారత రాజకీయ దిశను ప్రభావితం చేసింది. భూస్వామ్య వ్యతిరేక పోరాటంగా ప్రారంభమైన ఆ ఉద్యమం "నక్సల్బరి" పేరుతో దేశవ్యాప్తంగా విస్తరించింది. విద్యార్థి యువత, సామాజిక అసమానతలపై ఆవేదన కలిగిన వర్గాలు ఈ సిద్ధాంతానికి ఆకర్షితులయ్యాయి. గ్రామీణ భారతంలో భూమి పంపిణీ, కూలీల హక్కులు, గిరిజనుల జీవనాధారాల పరిరక్షణ వంటి అంశాలు ఆ ఉద్యమానికి మూల సూత్రాలుగా నిలిచాయి.ఆ ప్రభావంలోనే ఉమ్మడి కరీంనగర్ జిల్లా, ప్రస్తుత జగిత్యాల జిల్లా లోని మండల కేంద్రం అయిన బీర్ పూర్ గ్రామానికి చెందిన ముప్పాళ లక్ష్మణ్ రావు యువకుడిగా వామపక్ష భావజాలం వైపు మళ్లాడు. 1970లలో ఆంధ్రప్రదేశ్‌లో విస్తరించిన సాయుధ గుంపుల్లో చేరి, తరువాత పీపుల్స్ వార్ గ్రూప్ లో ప్రముఖ పాత్ర పోషించాడు. కొండపల్లి సీతారామయ్య నాయకత్వంలో ఏర్పడిన ఈ సంస్థ తెలంగాణ?ఆంధ్ర అటవీ ప్రాంతాల్లో గెరిల్లా యుద్ధ వ్యూహాలతో కార్యకలాపాలు సాగించింది. గ్రామీణ ప్రాంతాల్లో పార్టీ నిర్మాణం, గిరిజన యువతను ఆకర్షించడం, భూస్వామ్య వ్యతిరేక ప్రచారం వంటి కార్యక్రమాల్లో గణపతి సక్రియంగా పాల్గొన్నాడు. 2004లో పీపుల్స్ వార్ గ్రూప్ మరియు మావోయిస్టు కమ్యూనిస్ట్ సెంటర్ విలీనమై కమ్యూనిస్ట్ పార్టీ ఆఫ్ ఇండియా (మావోయిస్ట్) గా మారడం ఎడమచేయి అతివాద చరిత్రలో కీలక మలుపు. ఈ విలీనంతో దేశవ్యాప్తంగా ఉన్న విభిన్న గుంపులు ఒకే కేంద్రీయ నాయకత్వం కిందకి వచ్చాయి. ఆ సమయంలో గణపతి ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించి ఉద్యమానికి వ్యూహాత్మక దిశనిచ్చాడు. దండకారణ్య అటవీ ప్రాంతం కార్యకలాపాల కేంద్రంగా మారింది. 2004-2014 మధ్య కాలంలో దేశవ్యాప్తంగా మావోయిస్టు కార్యకలాపాలు గణనీయంగా పెరిగాయి. అధికార గణాంకాల ప్రకారం ఈ దశాబ్దంలో సుమారు 14,800కు పైగా హింసాత్మక ఘటనలు నమోదయ్యాయి; 6,000కు పైగా ప్రాణనష్టం సంభవించింది. భద్రతా దళాలు, మావోయిస్టులు, సాధారణ పౌరులు మూడు వర్గాలూ ఈ ఘర్షణల్లో బలయ్యారు. ముఖ్యంగా ఛత్తీస్‌గఢ్, ఒడిశా, జార్ఖండ్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్ సరిహద్దుల్లో దాడులు తీవ్రరూపం దాల్చాయి. 2009లో కేంద్ర ప్రభుత్వం "ఆపరేషన్ గ్రీన్ హంట్" పేరుతో విస్తృత భద్రతా చర్యలు ప్రారంభించింది. అటవీ ప్రాంతాల్లో సైనిక శక్తిని పెంచడం, ప్రత్యేక బలగాలను నియమించడం, ఇంటెలిజెన్స్ వ్యవస్థను బలోపేతం చేయడం వంటి చర్యలు తీసుకుంది. ఈ చర్యల ఫలితంగా 2014 తరువాత హింసాత్మక ఘటనలు క్రమంగా తగ్గుముఖం పట్టాయి. 2014- 2024 మధ్యకాలంలో ఘటనలు సుమారు 7,100కు తగ్గి, మరణాల సంఖ్య 1,800కు చేరినట్లు కేంద్ర సమాచారం సూచిస్తుంది. ఒకప్పుడు 126 జిల్లాలను ప్రభావితం చేసిన ఎడమచేయి అతివాదం ప్రస్తుతం సుమారు 10-12 జిల్లాలకు మాత్రమే పరిమితమైందని అధికార నివేదికలు చెబుతున్నాయి. 2024లో సుమారు 475 మంది మావోయిస్టులు లొంగిపోగా, 2025లో ఈ సంఖ్య వెయ్యి దాటిందని భద్రతా వర్గాలు ప్రకటించాయి. ఇదే కాలంలో భద్రతా దళాల చర్యల్లో వందలాది మావోయిస్టు కాడర్లు మరణించినట్లు కూడా గణాంకాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిణామాల్లో గణపతి వ్యక్తిగత పరిస్థితులు కూడా కీలకమయ్యాయి. ఆరోగ్య సమస్యలు, వయోభారం కారణంగా 2018 ప్రాంతంలో ఆయన ప్రధాన కార్యదర్శి బాధ్యతల నుండి తప్పుకోవడం జరిగింది. నాయకత్వ మార్పులు, అంతర్గత విభేదాలు, సాంకేతిక నిఘా వ్యవస్థల పెరుగుదల ఇవి ఉద్యమ సామర్థ్యాన్ని దెబ్బతీశాయి. గిరిజన ప్రాంతాల్లో రహదారులు, విద్యా సదుపాయాలు, మొబైల్ కనెక్టివిటీ విస్తరించడం వల్ల భూగర్భ కార్యకలాపాలు కష్టతర మయ్యాయి. ఇటీవల వెలువడుతున్న లొంగుబాటు వార్తలు ఈ క్రమంలో ప్రత్యేక ప్రాధాన్యం సంతరించుకున్నాయి. గణపతి స్వచ్ఛందంగా లొంగుతారా లేక ఇప్పటికే గోప్యంగా చర్చలు జరిగాయా అన్నది స్పష్టత పొందాల్సి ఉంది. అయితే ఒక విషయం మాత్రం స్పష్టం ఒక దశాబ్దాలపాటు అత్యంత వాంఛనీయుడిగా ప్రకటించ బడిన నాయకుడు లొంగితే, అది ఉద్యమ చరిత్రలో సంకేతాత్మక మలుపు అవుతుంది.ఇది కేవలం ఒక వ్యక్తి మార్పు కాదు; ఒక సిద్ధాంత సాయుధ ప్రయాణానికి సంబంధించిన చారిత్రక దశ. అయితే దీనిని పూర్తిస్థాయి ముగింపుగా చూడటం సరికాదు. ఎందుకంటే సామాజిక అసమానతలు, భూహక్కుల సమస్యలు, గిరిజనుల జీవనోపాధి సంక్షోభం వంటి మూల కారణాలు ఇంకా పూర్తిగా పరిష్కరించ బడలేదు. కేవలం భద్రతా చర్యలతో ఉద్యమం తగ్గినా, శాశ్వత పరిష్కారం కోసం సమగ్ర అభివృద్ధి విధానాలు, పారదర్శక పాలన, స్థానిక ప్రజల భాగస్వామ్యం అవసరం.గణపతి జీవితం విరుద్ధాల సమాహారం. ఒకవైపు సిద్ధాంతవేత్తగా రచనలు చేసిన వ్యక్తి; మరోవైపు హింసాత్మక పోరాటాలకు నాయకత్వం వహించిన వ్యక్తి. ఒకవైపు గిరిజన హక్కుల పరిరక్షణ నినాదాలు; మరోవైపు నిరపరాధుల ప్రాణనష్టం. ఈ విరుద్ధాలను అర్థం చేసుకోకుండా ఆయన ఉద్యమ రీతిని పూర్తిగా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు.లొంగుబాటు జరిగితే చట్టపరమైన ప్రక్రియలు, విచారణలు, బాధితులకు న్యాయం వంటి అంశాలు ముందుకు వస్తాయి. అదే సమయంలో ఆయన అనుభవాలు ఉద్యమ అంతర్గత గమనాన్ని వెలుగులోకి తెచ్చే అవకాశమూ ఉంటుంది. చరిత్రలో అనేక సాయుధ ఉద్యమాలు కాలక్రమేణా రాజకీయ ప్రధాన ప్రవాహంలో కలిసి పోయాయి. కొన్ని క్షీణించాయి. గణపతి పరిణామం కూడా ఆ దిశగా ఒక సూచన కావచ్చు.మొత్తంగా చూస్తే, ముప్పాళ లక్ష్మణ్ రావు అలియాస్ గణపతి ప్రయాణం భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ఒక సవాలు, ఒక పాఠం. సాయుధ మార్గం, ప్రజాస్వామ్య మార్గం మధ్య ఉన్న విభేదం, అభివృద్ధి భద్రతా సమతుల్యత, సామాజిక న్యాయం సాధన?ఇవి గణపతి ప్రయాణంలో అంతర్లీనంగా ఉన్నాయి. లొంగుబాటు సందర్భం దేశానికి ఒక ఆత్మపరిశీలన క్షణం. సమగ్ర అభివృద్ధి, న్యాయ సమ్మత పాలన, ప్రజల విశ్వాసం ఈ మూడు స్తంభాలపై దృష్టి కేంద్రీకరించినప్పుడే ఇలాంటి ఉద్యమాల అవసరం శాశ్వతంగా తగ్గుతుంది. గణపతి ఉద్యమ జీవితం ఆ దిశగా ఒక చరిత్ర బోధ.

# ఆధునిక సాంకేతికతతో దంత వైద్య రంగ పరిణామం

ప్రతి సంవత్సరం మార్చి 6న దేశ వ్యాప్తంగా జాతీయ దంత వైద్యుల దినోత్సవాన్ని నిర్వహించడం ఒక ఆచారంగా మాత్రమే కాక, ఆరోగ్య సంస్కృతికి చెందిన ఒక సజీవ చైతన్యంగా పరిణమించింది. మనిషి శరీర నిర్మాణంలో దంతాలు కేవలం ఆహారం నమిలే సాధనాలుగా మాత్రమే కాకుండా, శరీర సమగ్ర ఆరోగ్యానికి ప్రతిబింబాలుగా, వ్యక్తిత్వ ఆత్మ విశ్వాసానికి ఆధార స్తంభాలుగా నిలుస్తాయి. దంత ఆరోగ్యం బాగుంటేనే శరీర ఆరోగ్యం సమతుల్యంగా నిలుస్తుందనే వైద్యశాస్త్ర సూత్రం నేటి ఆధునిక పరిశోధనలతో మరింత బలపడింది. ఈ నేపథ్యంలో దంత వైద్యుల సేవలను స్మరించుకోవడం, వారి కృషిని గౌరవించడం, ప్రజల్లో నోటి ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడం జాతీయ దంత వైద్యుల దినోత్సవ ప్రధాన ఉద్దేశ్యాలుగా నిలుస్తున్నాయి. భారత దేశంలో దంత వైద్య రంగ అభివృద్ధి చరిత్రను పరిశీలిస్తే, స్వాతంత్ర్యానికి ముందు దంత చికిత్సలు ప్రధానంగా నగర కేంద్రాలకు మాత్రమే పరిమితమయ్యేవి. 1948లో ఏర్పడిన డెంటల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా దేశంలో దంత విద్యా ప్రమాణాలు, వైద్యుల నమోదు విధానం, వృత్తి నైతిక నియమావళిని స్థిర పరిచింది. ఈ మండలి ఏర్పాటుతో దంత వైద్య విద్యకు ఒక పటిష్ఠమైన వ్యవస్థ ఏర్పడింది. అప్పటివరకు కొన్ని మునిసిపల్ ఆసుపత్రులలో మాత్రమే ఉన్న దంత చికిత్సా సేవలు క్రమంగా ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య కళాశాలల రూపంలో విస్తరించాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా మూడు వందలకు పైగా దంత కళాశాలలు ఉన్నాయని అధికారిక గణాంకాలు సూచిస్తున్నాయి. ప్రతి సంవత్సరం దాదాపు ఇరవై అయిదు వేలకుపైగా దంత వైద్య పట్టభద్రులు బయటకు వస్తున్నారు. అయినప్పటికీ, గ్రామీణ ప్రాంతాలలో దంత వైద్యుల కొరత స్పష్టంగా కనిపించడం ఒక వ్యత్యాసంగా ఉంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికల ప్రకారం ప్రపంచ జనాభాలో సుమారు 60 నుండి 90 శాతం మంది పిల్లలు దంత కృమి రోగంతో బాధ పడుతున్నారు. వయోజనుల్లో దంత మాంస క్షయం, పళ్ల వాపులు, నోటి పూతలు వంటి సమస్యలు సాధారణమయ్యాయి. భారత దేశంలో నిర్వహించిన జాతీయ మౌఖిక ఆరోగ్య సర్వేల ప్రకారం ఐదు నుండి పది సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో దంత కృమి రోగం శాతం 50కి పైగా ఉంది. పెద్దవారిలో దాదాపు 85 శాతం మంది జీవితంలో ఏదో ఒక దశలో దంత మాంస వ్యాధులను అనుభవిస్తారని అంచనా. ఈ గణాంకాలు దంత వైద్యుల అవసరాన్ని మరింత స్పష్టంగా తెలియ జేస్తున్నాయి.దంత ఆరోగ్య సమస్యలు కేవలం నొప్పి లేదా దంత నష్టంతో ముగియవు. మధుమేహం, గుండె జబ్బులు, గర్భిణీలలో పూర్వ ప్రసవ సమస్యలు వంటి అనేక దీర్ఘకాలిక వ్యాధులకు నోటి ఆరోగ్యంతో ప్రత్యక్ష సంబంధం ఉందని ఆధునిక పరిశోధనలు నిరూపిస్తున్నాయి. నోటి లోపల ఉన్న సంక్రమణాలు రక్తప్రసరణ ద్వారా శరీరంలోని ఇతర భాగాలకు వ్యాపించి గుండె కవాటాలపై ప్రభావం చూపవచ్చని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఈ నేపథ్యంలో దంత వైద్యుల పాత్ర కేవలం చికిత్సకే పరిమితం కాకుండా, సమగ్ర ఆరోగ్య పరిరక్షణలో కీలక భాగంగా మారింది. జాతీయ దంత వైద్యుల దినోత్సవ సందర్భంలో దేశవ్యాప్తంగా ఉచిత దంత పరీక్షా శిబిరాలు, పాఠశాలలలో అవగాహన సదస్సులు, గ్రామీణ ప్రాంతాలలో చలించే దంత చికిత్సా వాహనాల ద్వారా సేవలు అందించడం వంటి కార్యక్రమాలు నిర్వహించ బడుతున్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో జాతీయ మౌఖిక ఆరోగ్య కార్యక్రమం అమలులో ఉంది. ఈ కార్యక్రమం ద్వారా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలోనే దంత చికిత్సా సౌకర్యాలు కల్పించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, అమలులో వనరుల కొరత, సిబ్బంది లోపం, ప్రజల్లో అవగాహనాభావం వంటి సవాళ్లు ఎదురవుతున్నాయి. భారత దేశంలో దంత వైద్యుల నిష్పత్తి పట్టణ ప్రాంతాలలో సుమారు ఒక లక్ష మందికి ఒక దంత వైద్యుడు ఉండగా, గ్రామీణ ప్రాంతాలలో అది రెండు నుండి మూడు లక్షల మందికి ఒకరుగా పడిపోతుంది. ఇది ఆరోగ్య సేవల అసమానతకు సూచిక. దంత వైద్య విద్యపై భారీ వ్యయం, ప్రైవేట్ ప్రాక్టీసులపై ఆధారపడాల్సిన పరిస్థితి, ప్రభుత్వ నియామకాలలో పరిమిత అవకాశాలు యువ దంత వైద్యులకు సవాళ్లుగా మారుతున్నాయి. అదే సమయంలో ఆధునిక సాంకేతికత, లేజర్ చికిత్సలు, ఇంప్లాంట్లు, కాస్మెటిక్ డెంటిస్ట్రీ వంటి విభాగాలలో భారత దంత వైద్యులు అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందుతున్నారు. పాన్పరాగ్, గుట్కా, ధూమపానం, మద్యపానం వంటి అలవాట్లు నోటి క్యాన్సర్‌కు దారితీస్తున్నాయి. భారతదేశం ప్రపంచంలోనే నోటి క్యాన్సర్ కేసుల్లో ముందంజలో ఉందని వైద్య పరిశోధనలు చెబుతున్నాయి. ప్రతి సంవత్సరం లక్షకు పైగా కొత్త నోటి క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయని అంచనా. ఈ నేపథ్యంలో దంత వైద్యులు ప్రారంభ దశలోనే లక్షణాలను గుర్తించి చికిత్సకు మార్గనిర్దేశం చేయగలరు. గ్రామీణ ప్రాంతాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రాణాలను కాపాడే బాధ్యత కూడా వారి భుజాలపై ఉంది. దంత వైద్యుల వృత్తి నైతికత కూడా అత్యంత ప్రాధాన్యమైన అంశం. అవసరం లేని చికిత్సలు సూచించడం, అధిక రుసుములు వసూలు చేయడం వంటి ఆరోపణలు అప్పుడప్పుడు వినిపిస్తున్నప్పటికీ, విస్తృతంగా చూస్తే దంత వైద్యులు సమాజానికి సేవాభావంతో పనిచేస్తున్నారు. వైద్య వృత్తి నమ్మకంపై నిలబడిన వ్యవస్థ. ఈ నమ్మకాన్ని కాపాడుకోవడం ప్రతి దంత వైద్యుడి ధర్మ బాధ్యత. నిరంతర వైద్య విద్య, సాంకేతిక పరిజ్ఞానం అప్‌డేట్ చేసుకోవడం, పరిశోధనల్లో పాల్గొనడం ద్వారా వారు తమ నైపుణ్యాన్ని పెంపొందించు కుంటున్నారు. పిల్లలలో చిన్ననాటి నుంచే దంత శుభ్రత అలవాట్లు పెంపొందించాలి. రోజుకు రెండుసార్లు పళ్లను తోమడం, చక్కెర పదార్థాల వినియోగం తగ్గించడం, ఆరు నెలలకు ఒకసారి దంత పరీక్ష చేయించుకోవడం వంటి సరళమైన అలవాట్లు అనేక సమస్యలను నివారించ గలవు. పాఠశాల స్థాయిలో మౌఖిక ఆరోగ్య పాఠ్యాంశాలు చేర్చడం, తల్లిదండ్రులలో అవగాహన పెంచడం ద్వారా సమాజం మొత్తం లాభపడుతుంది. ఈ దిశగా దంత వైద్యుల సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు కృషి చేస్తున్నాయి. జాతీయ దంత వైద్యుల దినోత్సవం కేవలం ఒక వృత్తి గౌరవదినం మాత్రమే కాదు; ఇది ప్రజారోగ్య చైతన్య దినం. దంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయడం వల్ల వ్యక్తిగత స్థాయిలోనే కాక సామాజిక ఆర్థిక స్థాయిలోనూ నష్టాలు కలుగుతాయి. పని దినాల నష్టం, చికిత్స ఖర్చులు, దీర్ఘకాలిక వ్యాధుల చికిత్స వంటి అంశాలు దేశ ఆర్థిక వ్యవస్థపై భారంగా మారుతాయి. నివారణే ఉత్తమ చికిత్స అనే సూత్రాన్ని అనుసరించి ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటే ఆరోగ్య ఖర్చులు గణనీయంగా తగ్గుతాయి. భవిష్యత్తు దృష్ట్యా దంత వైద్య రంగం మరింత సాంకేతిక ఆధారితంగా మారుతోంది. త్రిమితి ముద్రణ పద్ధతులు, డిజిటల్ ఎక్స్-రేలు, కృత్రిమ మేధస్సు ఆధారిత నిర్ధారణ పద్ధతులు రంగంలో ప్రవేశిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాలకు టెలీ-డెంటిస్ట్రీ సేవలను విస్తరించడం ద్వారా నిపుణుల సలహాలు సులభంగా అందించవచ్చు. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో చౌకగా, అందుబాటులో ఉండే సేవలను అందించడం కాలానుగుణ అవసరం. మొత్తం మీద జాతీయ దంత వైద్యుల దినోత్సవం మనకు ఒక స్పష్టమైన సందేశం ఇస్తుంది?నోటి ఆరోగ్యం మన సమగ్ర ఆరోగ్యానికి ద్వారం. దంత వైద్యులు ఆ ద్వారం వద్ద నిలబడి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే కవచంలా పనిచేస్తున్నారు. వారి సేవలను గౌరవించడం మాత్రమే కాక, ప్రతి పౌరుడూ దంత శుభ్రతను జీవితశైలిగా స్వీకరించడం ద్వారా ఈ దినోత్సవానికి నిజమైన అర్థం తీసుకురాగలం. ఆరోగ్యవంతమైన చిరునవ్వు ప్రతి మనిషి హక్కు. ఆ చిరునవ్వును నిలబెట్టే దంత వైద్యులకు జాతీయ దంత వైద్యుల దినోత్సవం సందర్భంగా కృతజ్ఞతాభివందనం తెలియ జేయడం సమాజం తరఫున ఒక కర్తవ్యంగా భావించాలి.


# హార్ముజ్ మూసివేతతో ప్రపంచం కుదేలైందా?

హార్ముజ్ సముద్ర మార్గం (జల సంధి) ప్రపంచంలో అతి ముఖ్యమైన జలమార్గాల్లో ఒకటి. ఇరాన్ ఉత్తర భాగంలో, ఒమన్ దక్షిణ భాగంలో ఉంది. పర్షియా గల్ఫ్‌ను ఒమన్ గల్ఫ్, అరేబియా సముద్రంతో కలిపే ఇరుకైన మార్గం.అత్యంత ఇరుకైన చోట కేవలం 33 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉంది. ఇది ఒక చిన్న మార్గం కావడం వల్లే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు 'గొంతు' లాంటిది. ఏ చిన్న అడ్డంకి వచ్చినా ప్రపంచ చమురు ధరలు ఆకాశాన్నంటుతాయి.. ఇప్పుడు జరుగుతున్న అమెరికా-ఇజ్రాయెల్ దాడుల తర్వాత మార్చి 2న ఈ మార్గం మూసివేస్తున్నామని ఇరాన్ రెవల్యూషనరీ గార్డ్స్ ప్రకటించింది. ఏ ఓడ ఈ మార్గం నుండి వెళ్లినా దాడి చేస్తామని హెచ్చరించింది. ఫలితం.. వాణిజ్య ఓడలు ఆగిపోయాయి. పెద్ద షిప్పింగ్ కంపెనీలు రవాణా ఆపేశాయి. ట్యాంకర్లు దాదాపు జీరోకి తగ్గాయి. కొన్ని ట్యాంకర్లపై దాడులు జరిగి 5కి పైగా ఓడలు దెబ్బ తిన్నాయి. 150కి పైగా ఓడలు ఆగిపోయాయి. హార్మోజ్ జల సంధి వాస్తవంగా మూసివేయబడింది. ప్రతి రోజూ సుమారు 20 మిలియన్ బ్యారెల్స్ ముడి చమురు, ఇతర ఇంధనాలు ఈ మార్గం గుండా ప్రపంచానికి వెళ్తాయి. ఇది ప్రపంచ మొత్తం చమురు వినియోగంలో సుమారు 20 శాతానికి సమానం. సముద్ర మార్గంలో వచ్చే చమురులో 25-30 శాతం ఇక్కడి నుంచే వస్తుంది. ద్రవ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)లో కూడా సుమారు 20 శాతం ఈ మార్గం గుండా వెళ్తుంది. గల్ఫ్ దేశాలు - సౌదీ అరేబియా, ఇరాక్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, కువైట్, ఖతార్, ఇరాన్ - వీటి చమురు ఎగుమతులు దాదాపు అన్నీ ఇక్కడి గుండానే వెళ్తాయి. ఆసియా దేశాలు ఎక్కువగా ఈ మార్గంపై ఆధారపడతాయి. చైనా అత్యధికం, ఆ తర్వాత భారత్, జపాన్, దక్షిణ కొరియా. ఈ మార్గం ద్వారా వెళ్లే చమురులో 84 శాతం ఆసియాకు వెళ్తుంది. ఇరాన్ ఉత్తర భాగాన్ని నియంత్రిస్తుంది కాబట్టి దాడి చేసి లేదా హెచ్చరించి మార్గాన్ని నియంత్రించగలదు. ఇది ఇరాన్‌కు పెద్ద వ్యూహాత్మక ఆయుధం. గతంలో కూడా ఇరాన్ ఇలాంటి హెచ్చరికలు చేసింది. కానీ ఈసారి అమలు చేసింది. దీని వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన దెబ్బ తగులుతోంది. చమురు ధరలు ఇప్పటికే 7 నుంచి 13 శాతం పెరిగాయి. ి100కి చేరే అవకాశం ఉంది. మన దేశం 85-90 శాతం చమురు



విదేశాల నుంచి తీసుకుంటుంది. అందులో సగం కంటే ఎక్కువ (సుమారు 50 శాతం) ఈ మార్గం గుండా వస్తుంది. రోజుకు 1.5 నుంచి 2.7 మిలియన్ బ్యారెల్స్. ఇరాక్, సౌదీ అరేబియా, యుఏఈ, కువైట్ నుంచి వచ్చే నూనె దాదాపు అన్నీ ఇక్కడి గుండానే.. దీంతో పాటు వంట గ్యాస్ (ఎల్‌పీజీ)లో 85 శాతం, ద్రవ గ్యాస్ (ఎల్ఎన్‌జీ)లో 55 శాతం ఈ మార్గం గుండా వస్తాయి.. ఈ మార్గం మూసివేత కొనసాగితే మన చమురు స్టాక్ కేవలం 40-45 రోజులకు సరిపోతుంది. పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు భారంగా పెరుగుతాయి. ద్రవ్యోల్బణం పెరిగి సామాన్యుల జీవన ఖర్చు ఎక్కువవుతుంది. రూపాయి విలువ తగ్గుతుంది. వాణిజ్య లోటు పెరుగు తుంది. ఇది కేవలం చమురు సమస్యే కాదు. ఎగుమతులు ఆలస్యమవుతాయి. షిప్పింగ్ ఖర్చులు పెరుగుతాయి. గల్ఫ్‌లో పని చేసే 90 లక్షల మంది మనవాళ్ల భద్రత, సంపాదన ప్రమాదంలో పడతాయి. దీర్ఘకాలంలో ఆర్థిక వ్యవస్థపై భారీ ఒత్తిడి పడుతుంది. ఇరాన్‌కు ఇది ఏకైక ఆయుధం. అణు శక్తి, సైనిక బలం తక్కువైనా ఈ మార్గంతో ప్రపంచాన్ని బెదిరించగలదు. అమెరికా నావల్ ఫోర్సెస్ ట్యాంకర్లను రక్షించడానికి సిద్ధమవుతున్నాయి కానీ పరిస్థితి ఇంకా ప్రమాదకరంగా ఉంది. ఇలాంటి చోక్‌పాయింట్లు (ఇరుకైన మార్గాలు) ఎంత బలహీనమైన దేశానికైనా పెద్ద శక్తిని ఇస్తాయని ఇది నిరూపిస్తోంది. అందుకే భారత్ తక్షణం రష్యా నుంచి చమురు ఎక్కువ దిగుమతి చేసుకోవడం ఒక ప్రత్యామ్నాయం. మన వ్యూహాత్మక చమురు నిల్వలను (రాఖఖీ) ఉపయోగించాలి. దీర్ఘకాలంలో చమురు దిగుమతులను వైవిధ్య పరచాలి. సౌర శక్తి, గాలి శక్తి వంటి ప్రత్యామ్నాయ ఇంధనాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి.. ఇరాన్ యుద్ధం మనకు ఒక పెద్ద హెచ్చరిక - ఎనర్జీ భద్రతను స్వయం సమృద్ధిగా మార్చుకోవాలి. హార్ముజ్ సముద్ర మార్గం మూసివేత ప్రపంచానికి పెద్ద సంక్షోభం తెచ్చింది. భారత్ వంటి దేశాలు ఇంధన ధరల పెరుగుదలతో ఆర్థికంగా దెబ్బతింటున్నాయి. ఇరాన్ యుద్ధం ఎక్కువ కాలం కొనసాగితే మూడో ప్రపంచ యుద్ధం అంచుకు వచ్చే ప్రమాదం ఉంది. అందుకే ఐక్య రాజ్యసమితి ద్వారా తక్షణం సంభాషణలు జరిపి యుద్ధాన్ని ఆపాలి. ఈ మార్గం తెరవాలి. యుద్ధం కొనసాగితే ప్రపంచమంతా నష్టపోతుంది. శాంతి, సంభాషణలు, దౌత్యం ద్వారా మాత్రమే ఈ సంక్షోభాన్ని అధిగమించాలి. భారత్ ఈ విషయంలో నాయకత్వం వహించాలి!

# మనిషి శరీరంలో క్యాన్సర్ ఎలా పుడుతుంది?



క్యాన్సర్ అంటే ఏమిటి, అది ఎలా పుడుతుంది, ఎన్ని రకాలు అనే భయం చాలా మందిలో ఉంటుంది. కణాల అనియంత్రిత పెరుగుదలతో శరీరంలో క్యాన్సర్ మొదలవుతుంది. దీనికి చరిత్ర, వివిధ వ్యాప్తి మార్గాలు, అవయవాలు, కణాల ఆధారంగా వర్గీకరణలు ఉన్నాయి. ప్రస్తుతం జరుగుతున్న పరిశోధనలు ఈ వ్యాధిపై కొత్త ఆశను రేకెత్తిస్తున్నాయి. క్యాన్సర్ అనే పేరు వినగానే చాలా మందికి మదిలో భయం మొదలవుతుంది. అసలు క్యాన్సర్ అంటే ఏంటి? అది మానవ శరీరంలో ఎలా పుడుతుంది? ఎన్ని రకాల క్యాన్సర్లు ఉన్నాయి? వాటిలో ఏది అత్యంత ప్రమాదకరమైనది? ఈ ప్రశ్నలకు సమాధానాలు తెలుసుకునే ప్రయత్నం చేద్దాం.. . క్యాన్సర్ ప్రస్తావన గ్రీకు, రోమన్ పుస్తకాల్లో ఉంది. క్రీస్తు పూర్వం 470, 370 మధ్యలో గ్రీకు వైద్యానికి పితామహుడిగా భావించే హిప్పోక్రటిస్ తొలుత క్యాన్సర్‌కు సంబంధించి కార్సినోస్ లేదా కార్సినోమా అనే పదాలను వాడారు. కార్సినోస్ అంటే గ్రీకు భాషలో పీత అని అర్థం. క్యాన్సర్ రోగులలో కనిపించే గట్టి గడ్డలు, అవి ఒక భాగం నుంచి మరో భాగానికి వ్యాపించడం, తుదిదశలో భరించలేని నొప్పి వంటి లక్షణాలను పీత గట్టి వెనుక భాగం, కాటుతో వచ్చే నొప్పికి పోల్చడం ద్వారా ఈ పేరు వచ్చింది. గ్రీకు ఫిజిషియన్ గాలిన్ అంకోస్ (గ్రీకులో ఉబ్బడం) అనే పదాన్ని ప్రసిద్ధం చేశారు. రోమన్ ఫిజిషియన్ సెల్సస్ తొలుత లాటిన్ పదం క్యాన్సర్‌ను వాడారు. 17వ శతాబ్దంలో మైక్రోస్కోప్‌ను కనుగొన్న తర్వాతే క్యాన్సర్‌పై పరిశోధనలు మొదలయ్యాయి. 19వ శతాబ్దంలో వైద్య పురోగతితో క్యాన్సర్ రహస్యం మరింత బయటపడటం మొదలైంది. మానవ శరీరం కోట్లకొద్దీ కణాలతో రూపొందుతుంది. కొత్త కణాలు పుట్టడం, వాటి పనులు నిర్వర్తించడం, వాటి పని పూర్తయిన తర్వాత నశించడం, మళ్ళీ కొత్త కణాలు పుట్టడం అనేది శరీరంలో జరిగే ఒక నియంత్రిత ప్రక్రియ. కణాలలోని జన్యువులు ఈ ప్రక్రియను నియంత్రిస్తాయి. అయితే, కార్సినోజెన్ ఎక్స్‌పోజర్, ఇన్ఫెక్షన్లు (వైరల్ ఇన్ఫెక్షన్లు), లేదా వంశపారంపర్యం వంటి కారణాల వల్ల ఈ జన్యువులలో మ్యుటేషన్ సంభవిస్తే, కణాలు నియంత్రణ కోల్పోయి అనియంత్రిత స్థాయిలో పెరుగుతాయి. వాటి పరిమాణం, సహజత్వంలో మార్పులు సంభవిస్తాయి. దీన్నే క్యాన్సర్ అంటారు. క్యాన్సర్ కణాలు నశించవు, వ్యాధి నిరోధక వ్యవస్థ నుంచి తప్పించుకుంటూ శరీరంలో ఒక భాగం నుంచి మరో భాగానికి విస్తరించి, ఇతర కణాలను, అవయవాలను దెబ్బతీస్తాయి. సాధారణ గడ్డలకు భిన్నంగా క్యాన్సర్ కణితులు శరీరంలోని ఏ భాగానికైనా విస్తరించగలవు.

## యాపిల్ కట్ చేసిన కాసేపటికే నల్లగా మారుతాయి ఎందుకు?



పండ్లు, కూరగాయలు కోసిన తర్వాత వాటి రంగు మారడం సహజమైన ప్రక్రియ అయినప్పటికీ దీని వల్ల వంట ప్రక్రియ ఆలస్యమవుతుంటుంది. ముఖ్యంగా బంగాళాదుంపలు, యాపిల్ కోసిన తర్వాత తక్కువ సమయంలోనే నల్లగా మారుతాయి. బంగాళాదుంపలు, యాపిల్‌లలో నల్లగా మారే ప్రక్రియను శాస్త్రీయంగా ఎంజైమాటిక్ బ్రౌనింగ్ అంటారు. బంగాళాదుంపలు, యాపిల్ పండ్లలో 'పాలీఫినాల్ ఆక్సిడేస్' అనే ఎంజైమ్ ఉంటుంది. ఈ ఎంజైమ్ కోసే వరకు కణాల లోపల సురక్షితంగా ఉంటుంది. అయితే కోసిన తర్వాత, ఈ కణాలు గాలిలోని ఆక్సిజన్‌తో సంబంధంలోకి వస్తాయి. ఆక్సిజన్, ఎంజైమ్‌ల మధ్య రసాయన ప్రతిచర్య మెలనిన్ అనే వర్ణద్రవ్యాన్ని ఉత్పత్తి చేస్తుంది. దీని వలన కోసిన ప్రాంతం నల్లగా లేదా గోధుమ రంగులో కనిపిస్తుంది. కట్ చేసిన బంగాళాదుంపలు, యాపిల్‌లు తాజాగా ఉంచడానికి మీరు ఖచ్చితంగా ఇంట్లో కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. బంగాళాదుంపలను కోసిన వెంటనే చల్లటి నీటిలో నానబెట్టాలి. ఇది గాలితో వాటి సంబంధాన్ని తెంచుకుంటుంది. దీంతో నల్లగా మారకుండా నిరోధిస్తుంది. ఇది సులభమైన చిట్కా. యాపిల్ కోసి తర్వాత తినాలనుకుంటే ముక్కలపై కొంచెం నిమ్మరసం రాయాలి. నిమ్మకాయలోని విటమిన్ సి (యాంటీఆక్సిడెంట్) ఆక్సీకరణ ప్రక్రియను నెమ్మదిస్తుంది. అలాగే, ఒక గిన్నెలో నీళ్లు తీసుకుని దానికి చిటికెడు ఉప్పు వేయాలి. అందులో బంగాళాదుంప లేదా యాపిల్ ముక్కలను ఉంచాలి. దీనివల్ల రంగు మారదు. యాపిల్ఎక్కువసేపు తాజాగా ఉంచాలనుకుంటే, రెండు కప్పుల నీటిలో రెండు టేబుల్ స్పూన్ల తేనె కలిపి అందులో యాపిల్ ముక్కలను ఉంచాలి. దాదాపు 3–5 నిమిషాల తర్వాత ముక్కలను తొలగించాలి. అలాగే కోసిన పండ్లను వెంటనే ఉపయోగించకూడదనుకుంటే, వాటిని క్లాంగ్ ఫిల్మ్‌తో గట్టిగా చుట్టండి లేదా రిఫ్రిజిరేటర్‌లో గాలి చొరబడని కంటైనర్‌లో నిల్వ చేయండి. దీనితో పాటు బంగాళాదుంపలు లేదా యాపిల్ నల్లబడకుండా ఆపాలనుకుంటే ఒక గిన్నెలో నీరు తీసుకొని దానికి ఒక చెంచా వెనిగర్ కలపండి. కట్ చేసిన బంగాళాదుంపలు లేదా యాపిల్ ముక్కలను ఈ నీటిలో 2–3 నిమిషాలు ముంచండి. ఇది వాటి రంగును తెల్లగా, చాలా కాలం పాటు తాజాగా ఉంచుతుంది. కానీ తినడానికి లేదా వంట చేయడానికి ముందు వాటిని ఒకసారి సాధారణ నీటితో శుభ్రం చేసుకోవడం మంచిది.

## నల్లశనగలతో అద్భుతమైన ఆరోగ్యం!



మన రోజువారీ ఆహారంలో పప్పుదినుసులు ముఖ్యమైన పాత్ర పోషిస్తాయి. అందులో ముఖ్యంగా నల్ల శనగలు (కల చనా) ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. పోషకాలు సమృద్ధిగా ఉండటం వల్ల నల్ల శనగలను సూపర్ ఫుడ్‌గా కూడా పరిగణిస్తారు. ఇవి శరీరానికి శక్తిని ఇవ్వడంతో పాటు అనేక రకాల వ్యాధులను దూరం చేయడంలో సహాయపడతాయి. నానబెట్టిన నల్లశనగలు రోజు ఒక వంద గ్రాములు తిన్నారంటే శక్తి పెరిగి జీర్ణవ్యవస్థ మెరుగుపడుతుంది. కండరాలు బలంగా మారుతాయి. ఆ రోజంతా మంచి ఎనర్జీతో ఉత్సాహంగా ఉంటారు. అంతేకాదు, మీ శరీరానికి కావలసిన అన్ని రకాల ప్రోటీన్లు ఈ నల్ల శనగలలో పుష్కలంగా ఉండటం వలన అలసట రాదు. శరీరానికి కావాల్సిన పోషకాలు: నల్ల శనగల్లో ప్రోటీన్, ఫైబర్, ఐరన్, కాల్షియం, మాగ్నీషియం, పొటాషియం వంటి ముఖ్యమైన పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇవి శరీరానికి శక్తిని అందించి కండరాల పెరుగుదలకి సహాయపడతాయి. ముఖ్యంగా శాకాహారులు ప్రోటీన్ కోసం నల్ల శనగలను ఎక్కువగా తీసుకోవడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. నల్ల శనగల్లో ఉన్న విటమిన్లు, ఖనిజాలు శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచుతాయి. దీని వల్ల చిన్నపాటి ఇన్ఫెక్షన్లు, జలుబు వంటి సమస్యల నుండి రక్షణ లభిస్తుంది. జీర్ణక్రియ మెరుగుపరుస్తాయి: నల్ల శనగల్లో ఉన్న ఫైబర్ జీర్ణవ్యవస్థను బలపరుస్తుంది. మలబద్ధకం సమస్యను తగ్గించి జీర్ణక్రియను సక్రమంగా జరగేలా చేస్తుంది. కడుపు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో కూడా ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. రక్తహీనత నివారణ: నల్ల శనగల్లో ఐరన్ అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో హీమోగ్లోబిన్ స్థాయిలను పెంచడంలో సహాయపడుతుంది. రక్తహీనత సమస్య ఉన్నవారు నల్ల శనగలను ఆహారంలో చేర్చుకుంటే మంచి ఫలితాలు పొందవచ్చు. గుండె ఆరోగ్యం మెరుగుదల: నల్ల శనగల్లో ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల గుండె ఆరోగ్యానికి మేలు చేస్తాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్ స్థాయిని తగ్గించి గుండె సంబంధిత సమస్యల ప్రమాదాన్ని తగ్గించడంలో సహాయపడతాయి. బరువు తగ్గడంలో సహాయం: నల్ల శనగల్లో ఫైబర్ అధికంగా ఉండటం వల్ల తిన్న తర్వాత ఎక్కువసేపు ఆకలి వేయదు. దీంతో అధికంగా తినే అలవాటు తగ్గి బరువు నియంత్రణలో ఉంటుంది. అందుకే డైట్ ఫాలో అయ్యే వారు నల్ల శనగలను తమ ఆహారంలో చేర్చుకుంటారు. నల్ల శనగలను రాత్రి నీటిలో నానబెట్టి ఉదయం తింటే ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుంది. అలాగే కూరలు, సలాడ్లు, స్నాక్స్ రూపంలో కూడా తీసుకోవచ్చు. క్రమం తప్పకుండా వీటిని ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి కావాల్సిన పోషకాలు అందుతాయి. పోషకాలు సమృద్ధిగా ఉన్న నల్ల శనగలు ఆరోగ్యానికి ఎంతో ఉపయోగకరమైన ఆహారం. రోజూ పరిమిత మోతాదులో వీటిని తీసుకుంటే జీర్ణక్రియ మెరుగుపడి, గుండె ఆరోగ్యం బాగుండి, శరీరానికి శక్తి లభిస్తుంది. అందుకే నల్ల శనగలను ఆరోగ్యకరమైన ఆహారంలో భాగంగా చేసుకోవడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.



## ప్రెగ్నెన్సీ టైంలో టీ తాగొచ్చా?

చాలా మంది టీతో తమ రోజును ప్రారంభిస్తుంటారు. కానీ గర్భధారణ సమయంలో టీ తాగే అలవాటు పట్ల జాగ్రత్తగా ఉంటాలి. టీలోని కెఫిన్, పాలు, చక్కెర శరీరాన్ని వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. గర్భధారణ సమయంలో ఆహారం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. ఎందుకంటే ఈ కాలంలో గర్భిణీ తనకు మాత్రమే కాకుండా గర్భంలో ఉన్న బిడ్డకు కూడా పోషకాలను అందించాలి. బలహీనత, అలసట, తలతిరగడం, రక్తహీనత, ఆమ్లత్వం, జీర్ణ సమస్యలను కలిగిస్తుంది. పోషకాల లోపం శిశువు అభివృద్ధిని కూడా ప్రభావితం చేస్తుంది. అందువల్ల గర్భధారణ సమయంలో ఏమి తినాలో, ఏమి నివారించాలో తెలుసుకోవడం చాలా ముఖ్యం. చాలా మంది టీతో తమ రోజును ప్రారంభిస్తుంటారు. కానీ గర్భధారణ సమయంలో టీ తాగే అలవాటు పట్ల జాగ్రత్తగా ఉంటాలి. టీలోని కెఫిన్, పాలు, చక్కెర శరీరాన్ని వివిధ రకాలుగా ప్రభావితం చేస్తాయి. గర్భధారణ సమయంలో టీని మితంగా తాగడం సాధారణంగా సురక్షితమైనదిగా భావిస్తారని డాక్టర్ అనామిక గౌర్ అంటున్నారు. అయితే దీని అధిక వినియోగం హానికరం. టీలోని కెఫిన్ శరీరంలోని ఐరన్ శాతాన్ని తగ్గిస్తుంది. ఇది రక్తహీనత ప్రమాదాన్ని పెంచుతుంది. అంతేకాదు, ఎక్కువ టీ తాగడం వల్ల ఆమ్లత్వం, గ్యాస్, గుండెల్లో మంట వస్తుంది. గర్భధారణ సమయంలో ఇటువంటి సమస్యలు సర్వసాధారణం కాబట్టి, అవి పెరిగే అవకాశం ఉంది. కొంతమంది స్త్రీలలో టీ వినియోగం నిద్రలేమి, వేగవంతమైన హృదయ స్పందనకు కారణమవుతుంది. అందువల్ల రోజుకు ఒకటి కంటే ఎక్కువ కప్పుల టీ తాగకూడదు. ఆమ్లత్వం లేదా వాంతులు సమస్యలు ఉంటే టీని నివారించడం మంచిది. నిజానికి వైద్యుల సలహా మేరకు మాత్రమే టీ తాగడం సురక్షితం. గర్భిణీలకు టీకి బదులుగా ఆరోగ్యకరమైన ఎంపికలు చాలానే ఉన్నాయి. వేడిగా పాలు తాగవచ్చు. ఇది కాల్షియంను అందిస్తుంది. ఎముకలను బలోపేతం చేయడంలో సహాయపడుతుంది. నీళ్లు శరీరాన్ని హైడ్రేట్ చేస్తుంది. అలసటను కూడా తగ్గిస్తుంది. నిమ్మకాయ నీళ్లు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది కాబట్టి ఇవి తాగవచ్చు. బదులుగా అల్లం టీ తాగే అలవాటు ఉంటే దానిని కూడా తాగవచ్చు. ఇది వాంతుల అనుభూతిని తగ్గించడంలో సహాయపడుతుంది. అంతే కాదు సుగంధ ద్రవ్యాల పానీయాలను కూడా తాగవచ్చు. కానీ వీటిని తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించడం మంచిది. ఈ ప్రత్యామ్నాయాలు శరీరానికి పోషకాలను అందిస్తాయి, ఆమ్లత ప్రమాదాన్నీ తగ్గిస్తాయి.

# అంగరంగ వైభవంగా.శ్రీ రంగనాథ స్వామి రథోత్సవం

## రూ. 32 కోట్లతో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు చర్యలు

**వనపర్తి :** చేపట్టిన కాంగ్రెస్ ప్రభుత్వం.వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి .వనపర్తి జిల్లా శ్రీరంగాపురం మండల కేంద్రంలో ప్రసిద్ధిగాంచిన శ్రీ రంగనాయక స్వామి ఆలయం తో పాటు, రహదారులు వసతి గృహాలు, రంగసముద్రాన్ని అభివృద్ధి పరిచి బోటింగ్ ఏర్పాటు చేసేందుకు, రంగసముద్ర నుంచి వచ్చే వరద వలన పంట కాలువలు కోసుకుపోకుండా ఉండేందుకు అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి పేర్కొన్నారుశ్రీ రంగనాయక స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా బుధవారం బుధవారం నిర్వహించిన రథోత్సవ కార్యక్రమానికి వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి , వనపర్తి రాజవంశీయులు రాజా కృష్ణదేవ రావు హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయంలో నుంచి పల్లకిలో ఊరేగింపుగా రథం వద్దకు చేర్చారు.అనంతరం రథోత్సవ కార్యక్రమంలో పాల్గొని స్వామి వారి రథాన్ని లాగారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. శ్రీరంగాపురం గ్రామాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామని.ఎంతో చరిత్ర కలిగిన ఈ ప్రాంతాన్ని రూ 5 కోట్లతో టూరిజం హబ్బుగా మార్చనున్నట్లు ఎమ్మెల్యే చెప్పారు.రూ. 2 కోట్ల రూపాయలతో ఆలయానికి సంబంధించిన ప్రధాన రహదారిని బాగు చేయనున్నట్లు ఆయన తెలిపారు.1 కోటి 50 లక్షల రూపాయలతో అతిథి గృహాలను అభివృద్ధి చేయనున్నట్లు ఆయన తెలిపారు.రూ. 24 కోట్ల రూపాయలతో నీటిపారుదల శాఖ ఆధ్వర్యంలో శ్రీ రంగనాయక సముద్ర వెనకాల ఉన్న పంట పొలాలలోని కాలువలను బలోపేతం చేసేందుకు కేటాయించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మద్దిలేటి వనపర్తి మున్సిపల్ చైర్మన్ మాధవి రమేష్, పెబ్బేర్ మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, వైట్ చైర్మన్ సుమిత్ర ఎల్లారెడ్డి, వనపర్తి వ్యవసాయ మార్కెట్ యార్డ్ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డ్ అధ్యక్షులు ప్రమోదిని రెడ్డి, ఉపాధ్యక్షులు విజయవర్ధన్ రెడ్డి, శ్రీరంగపురం మండల నాయకులు శ్రీహరి రాజు, పెబ్బేరు మండలం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



# ఎదురెక్కిన గోదావరి జలాలు..

## ఐదు రోజులుగా కొనసాగుతున్న ఎత్తిపోతలు

**ధర్మారం/ రామడుగు/ మల్యాల/మెట్‌పల్లి :** గోదావరి జలాలు ఎగువకు ఎదురెక్కుతున్నాయి. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం లో భాగంగా ఎల్లంపల్లి నుంచి శ్రీరాంసాగర్‌వైపు పరుగులు పెడుతున్నాయి. లింక్-2లో ఐదు రోజులుగా ఎత్తిపోతలు కొనసాగుతుండగా, ఒక్కో పంపుహౌస్ నుంచి ఎగువకు పయనిస్తున్నాయి. ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి ధర్మారం మండలంలోని నంది పంప్‌హౌస్‌కు సొరంగాల ద్వారా వచ్చిన నీటిని ప్రతి రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల దాకా పంపింగ్ చేసి ఆ తర్వాత నిలిపి వేస్తున్నారు. మంగళవారం 2, 7 నంబర్ల మోటర్లను నడిపించి, 3,150 క్యూసెకుల చొప్పున 2 మోటార్ల ద్వారా 6,300 క్యూసెక్కల జలాలను నంది రిజర్వాయర్‌లోకి ఎత్తిపోయిస్తున్నారు. అక్కడి నుంచి జంట సొరంగాల ద్వారా రామడుగు మండలం లక్ష్మీపూర్‌లోని గాయత్రీ పంప్‌హౌస్‌కు వస్తుండగా, అక్కడి 2, 4 మోటర్ల ద్వారా ఎత్తిపోస్తూ అప్రోచ్ కెనాల్ ద్వారా వరద కాలువకు తరలిస్తున్నారు. అక్కడి నుంచి ఎస్సారెస్పీ పునర్జీవ పథకంలో భాగంగా మల్యాల మండలం రాంపూర్ పంప్‌హౌస్‌కు ఎదురెక్కుతుండగా, అక్కడ మోటర్లను ఆన్ చేసి 7,250 క్యూసెక్కుల నీటిని ఎగువకు పంపింగ్ చేస్తున్నారు. అక్కడి నుంచి మెట్‌పల్లి మండలం రాజేశ్వర్‌రావుపేట పంప్‌హౌస్ వైపు గోదావరి నీళ్లు తరలుతున్నాయి. అక్కడ మధ్యాహ్నం రెండు నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు మూడు మోటార్ల ద్వారా ఎత్తిపోతలు కొనసాగాయి. ఒక్కో మోటర్ ద్వారా 1450 క్యూసెక్కుల చొప్పున మొత్తం 0.07 టీఎంసీల నీటిని వరదకాలువ ఎగువ ప్రాంతానికి తరలించినట్లు అధికారులు తెలిపారు.



# బల్దియాలో సమస్యల తిష్ట..

# ఎక్కడి సమస్యలు అక్కడే

**నిర్మల్ :** నిర్మల్ మున్సిపాలిటీ పరిధిలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. పట్టణంలోని 42 వార్డుల్లో నెలకొన్న సమస్యలను అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించకపోవడంతో ప్రజలు నిత్యం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మల్ మున్సిపాలిటీ ఏర్పాటైనప్పటి నుంచి శివారు వార్డుల్లో అభివృద్ధి పనులు జరుగకపోగా బల్దియా పాలన తీరుపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఏటా పన్నులు చెల్లిస్తున్నప్పటికీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, వీధి దీపాలు లాంటి మౌలిక వసతులు లేకపోవడంతో మురుగునీటి కుంటల మధ్య జీవనం సాగించాల్సి వస్తోందని ప్రజలు వాపోతున్నారు. జౌళినాల పరిసర కాలనీల్లో పూడికతీత చేపట్టకపోవడంతో వర్షాకాలంలో మురుగు నీరు ఇండ్లలోకి చేరుతుందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అన్ని వార్డులను సమానంగా అభివృద్ధి చేసి పట్టణాన్ని ప్రగతి పథంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. నూతన పాలక వర్గంలోనైనా పట్టణ అభివృద్ధి ఏ విధంగా జరుగుతుందో వేచి చూడాలి.



**వార్డుల్లో పేరుకుపోయిన సమస్యలు**

నిర్మల్‌లో మొత్తం 42 వార్డులు ఉండగా వాటిలో దాదాపు 30కి పైగా మురుగు వార్డులు ఉన్నాయి. ఈ వార్డుల్లో అభివృద్ధి పనులు చేపట్టకపోవడంతో కాలనీలు మౌలిక సదుపాయాలకు దూరంగా ఉన్నాయి. పాత వార్డుల్లో ఉన్న సీసీ రోడ్లు, మురుగు కాలువలు అనేక ఏళ్ల క్రితం నిర్మించబడినవిగా ఉండటంతో మరమ్మతులు చేయాల్సి ఉంది. శివారు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తూ దిగువ ప్రాంతాల్లో నీటి కుంటలను తలపిస్తోంది. దీంతో దోమలు, పందులు విస్తరిస్తూ వ్యాధుల భయం నెలకొంది.

**నూతన పాలకవర్గంపై ఆశలు**

నిర్మల్ మున్సిపాల్టీలో దాదాపు లక్షా ఇరవై వేల జనాభా, దాదాపు 30 వేల నివాస సముదాయాలు ఉన్నాయి. శాంతినగర్ జర్నలిస్ట్ కాలనీ, సోఫినగర్, విశ్వనాథ్‌పేట్, గాజుల్‌పేట్, రాంనగర్, గొల్లపేట్, మహాలక్ష్మీ వాడ, డబుల్‌బెడ్రూం ఇండ్లలో మౌలిక సదుపాయాలు లేవు. ఇటీవల సీఎం రేవంత్ రెడ్డి నిర్మల్ మున్సిపాలిటీకి రూ.15 కోట్ల నిధులు విడుదల చేశారు. ఈ నిధులను ప్రధానంగా శివారు కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణానికి వినియోగించి పట్టణాన్ని సమగ్ర అభివృద్ధి దిశగా తీసుకెళ్లాలని నూతన పాలకవర్గాన్ని ప్రజలు కోరుతున్నారు.

## తొర్రూరు కాంగ్రెస్ పార్టీలో కుమ్ములాట

**పాలకుర్తి :** నియోజకవర్గంలో కాంగ్రెస్ లో వర్గపోరు మరోసారి బయటపడింది. కాంగ్రెస్ పార్టీలో కోవర్టులు ఉన్నారని తొర్రూరు మున్సిపాలిటీలో కాంగ్రెస్ నుండి పోటీ చేసి ఓడిపోయిన కౌన్సిలర్ అభ్యర్థుల సంచలన వ్యాఖ్యలు చేసారు. కాంగ్రెస్ పార్టీ నుండి కౌన్సిలర్లుగా పోటీ చేసిన అభ్యర్థులు పొనుగోటి సోమేశ్వర్ రావు, పంజా కల్పన, జలగం శ్రీనివాస్ మీడియాతో మాట్లాడారు. కాంగ్రెస్ నాయకుల వల్లే మేము ఓడిపోయాం. కాంగ్రెస్ సీనియర్ నాయకులు కాకిరాల హరిప్రసాద్, కిశోర్ రెడ్డిలను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేసారు. రాబోయే జడ్పీటీసీ, ఎంపిటీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ గెలవాలి అంటే కోవర్టులపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కోవర్టులంతా బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇస్తూ కాంగ్రెస్ను బలహీనపరుస్తున్నారని ఆరోపించారు. వారి సస్పెన్షన్ వరకు పోరాటం ఆపమని హెచ్చరించారు.

## గోదావరి పుష్కరాల కోసం కమిటీ

**హైదరాబాద్ :** తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న గోదావరి పుష్కరాలకు (2027) ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించింది. 'దక్షిణ కుంభమేళా'గా పిలిచే ఈ మహా క్రతువు నిర్వహణ, ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది మంది సభ్యులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తారు.కమిటీ సభ్యులుగా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పి.సుదర్శన్ రెడ్డిలను నియమించారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి గోదావరి తీర ప్రాంతాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశాలకు పిలవనున్నారు. త్వరలోనే కమిటీ సమావేశమై సిఫార్సులను అందజేయనుంది.2027 జూలై 23న గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈసారి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కోరాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో సుమారు 560 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తుండటంతో దాదాపు 74 ఘాట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ముఖ్యంగా బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం ఆలయాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో అక్కడ ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు.పుష్కరాల ఏర్పాట్లు తాత్కాలికంగా కాకుండా, శాశ్వత ప్రాతిపదికన ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆలయాల అభివృద్ధి, పర్మనెంట్ పుష్కర ఘాట్లు, రోడ్లు, వసతి సముదాయాలు నిర్మించాలని ఆదేశించారు. రోజుకు రెండు లక్షల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ట్రాఫిక్, పార్కింగ్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## మహిళల భద్రత కోసం షీ టీమ్స్

## జిల్లా ఇన్‌చార్జి ఉషారాణి




**తాండూర్ :** మహిళల భద్రత కోసమే షీ టీమ్స్ పనిచేస్తున్నాయని మంచిర్యాల జిల్లా షీ టీమ్ ఇన్‌చార్జి ఎస్సై ఉషారాణి అన్నారు. మండలంలోని రేచిని జడ్పీహెచ్ఎస్ లో విద్యార్థులకు డ్రగ్స్, షీ టీమ్ మీద నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. మహిళా చట్టాలు, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, షీ టీమ్ ప్రాముఖ్యత , మానవ అక్రమ రవాణా, పోక్సో చట్టాలు, బాల్య వివాహాలు దాని పరిణామాల గురించి, ఈవ్ టీజింగ్, టీ సేఫ్ అప్లికేషన్ తదితర వాటిపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్స్, సైబర్ హెల్ప్ లైన్ నంబర్, డయల్ 100 ప్రాముఖ్యత, సమాజ రుగ్మతల గురించి వివరించారు. ఎవరైనా మహిళలను వేధించినా, రోడ్డుపై వెళ్లేటప్పుడు అవహేళనగా మాట్లాడినా ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే 100 , రామగుండం షీ టీమ్ నెంబర్ 6303923700 కు ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా షీ టీమ్ కానిస్టేబుల్స్ శ్రవణ్, జ్యోతి, పాఠశాల హెడ్ మాస్టర్ ప్రదీప్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మిస్టరీగా గుండెపోటు మరణం..

## 12 రోజుల తర్వాత పూడ్చిన శవానికి పోస్టుమార్టం



**ఓదెల :** పెద్దపల్లి జిల్లా ఓదెల మండల కేంద్రంలో కనికి రెడ్డి బాబు(61) ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అయితే కనికిరెడ్డి బాబు మృతిపై కుటుంబ సభ్యులకు అనుమానాలు రావడంతో పూడ్చిపెట్టిన శవాన్ని 12 రోజుల తర్వాత బయటకు తీసి గురువారం పోస్టుమార్టం నిర్వహించారు. వివరాల్లోకి వెళితే.. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగి అయిన బాబు తన వ్యవసాయ పొలంలో పశువులకు గడ్డి కోయడానికి వెళ్లాడు. అయితే బాబు అక్కడ మృతి చెంది ఉండడాన్ని గమనించిన పరిసర పొలం రైతు ఈ విషయాన్ని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. కుటుంబ సభ్యులు పొలం వద్దకు వెళ్లి చూడగా బాబు గుండెపోటుతో మరణించినట్లు మొదటగా భావించారు. అయితే బాబు శరీరంపై ఒకటి, రెండు చోట్ల గాయాలు కల్పించినట్లు కుటుంబ సభ్యులు ఆలస్యంగా గమనించారు. ఆ అనుమానం మూడు రోజుల తర్వాత మరింత బలపడడంతో బాబు మృతిలో ఏదో మిస్టరీ ఉందని, పూడ్చివేసిన శవానికి పోస్టుమార్టం జరిపించాలని పోలీసులకు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గురువారం పూడ్చిపెట్టిన శవాన్ని బయటకు తీయించి డాక్టర్లతో పోస్టుమార్టం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పొత్కపల్లి ఎస్సై దీకొండ రమేష్ గౌడ్, ఓదెల తహసిల్దార్ ధీరజ్ కుమార్ గౌడ్, డాక్టర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా ఓదెలలో పూడ్చిన శవానికి పోస్టుమార్టం నిర్వహించిన విషయం కలకలం రేపుతోంది. బాబు మృతి గుండెపోటేనా..? లేక ఎవరైనా హత్య చేశారా.. ? అనే విషయమై గ్రామస్తుల్లో చర్చ జరుగుతుంది. పోస్టుమార్టం నివేదికపై కుటుంబ సభ్యులు, గ్రామస్తుల్లో ఉత్కంఠ నెలకొంది.

# బిజినెస్

## బజాజ్ ఫైనాన్స్ స్టాక్ దూకుడు.. భారీ లాభాల్లో ట్రేడింగ్




భారతదేశంలో ప్రముఖ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ బజాజ్ ఫైనాన్స్ షేరు నేడు స్టాక్ మార్కెట్‌లో సానుకూలంగా ట్రేడ్ అవుతోంది. ఉదయం 11:41 గంటల సమయానికి ఈ షేరు క్రితం ముగింపు ధర 945.10 తో పోలిస్తే దాదాపు 0.97% (రూ. 9.11) పెరిగి రూ. 954.20 వద్ద కొనసాగుతోంది. మార్కెట్ గమనంలో ఈ స్టాక్ పటిష్టమైన స్థితిని ప్రదర్శిస్తోంది. ప్రస్తుతం కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 5,96,238 కోట్లుగా ఉండగా, ఈ రంగంలో మార్కెట్ క్యాప్ పరంగా బజాజ్ ఫైనాన్స్ మొదటి స్థానంలో (ఖీజీనిని 1) కొనసాగుతుండటం విశేషం. కంపెనీ యొక్క ఇతర కీ మెట్రిక్స్ గమనిస్తే, దీని పి.ఇ (ఖఇ) రేషియో 33.09 గాను, షేరుకు వచ్చే ఆదాయం (ఇఖూ) 28.98 గాను ఉన్నాయి. ఈ స్టాక్ యొక్క 52 వారాల గరిష్ట ధర రూ. 1,102 కాగా, కనిష్ట ధర రూ. 821 గా నమోదైంది. అదనంగా, కంపెనీ 2.92% డివిడెండ్ యీల్డ్‌ను కలిగి ఉంది. ఇన్వెస్టర్లు బజాజ్ ఫైనాన్స్ యొక్క ఫండమెంటల్స్, టెక్నికల్ ఇండికేటర్లను పరిశీలిస్తూ మార్కెట్ కదలికలను నిశితంగా గమనిస్తున్నారు. ఈ కారణంతో బజాజ్ ఫైనాన్స్ షేర్లు స్టాక్ మార్కెట్లో సానుకూలంగా ట్రేడ్ అవుతున్నాయని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

## అమెజాన్‌లో మరోసారి లేఆఫ్‌లు.. రోబోటిక్స్ టీమ్‌పై వేటు




ప్రముఖ ఇ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌లో లేఆఫ్‌లు కొనసాగుతున్నాయి. ఈసారి రోబోటిక్స్ విభాగంలోని ఉద్యోగులపై వేటు పడింది. సుమారు 100 మంది వైట్‌కాలర్ ఉద్యోగులపై ప్రభావం పడినట్లు ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులను ఉటంకిస్తూ 'రాయిటర్స్' తన కథనంలో పేర్కొంది. ఈ ఏడాది జనవరిలో 16 వేల మంది ఉద్యోగులను అమెజాన్ తొలగించింది. మరిన్ని తొలగింపులు ఉంటాయని అప్పట్లోనే సంకేతాలు ఇచ్చింది. అందులోభాగంగానే ఇప్పుడు తాజా లేఆఫ్‌లు చేపట్టింది. ఇందులోభాగంగా అమెజాన్ గోదాముల్లో పనిని ఆటోమేషన్ చేసేందుకు రోబోలను డిజైన్ చేసే టీమ్‌పై వేటు పడింది. కస్టమర్లకు మెరుగైన సేవలందించేందుకు తమ టీమ్‌ను ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటామని అమెజాన్ ఓ ప్రకటనలో పేర్కొంది. అయితే ఎంతమందిని తొలగించిందీ పేర్కొనకుండా లేఆఫ్‌లను ధ్రువీకరించింది. వేర్‌హౌస్‌లో కార్మికులకు సాయపడేందుకు రోబోటిక్ విభాగమైన బ్లూ జే.. గతేడాది అక్టోబర్‌లో రోబోలను ప్రదర్శించింది. అయితే, ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఈ ఏడాది జనవరిలో వీటి తయారీని నిలిపివేసింది. ఈ నేపథ్యంలోనే ఉద్యోగుల కోతలను ప్రకటించింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగ ప్రవేశం, ఖర్చుల తగ్గింపులో భాగంగా గతేడాది అక్టోబర్‌లో 14వేల మందిని, ఈ ఏడాది జనవరిలో 16 వేల మంది కలిపి ఇప్పటికే 30 వేల మంది ఉద్యోగులను అమెజాన్ పక్కనపెట్టింది.

# సామాన్యుల కోసం పోస్టాఫీస్‌లో బెస్ట్ స్కీమ్




సామాన్య ప్రజలు తాము సంపాదించిన దాంట్లో కొంత పొదుపు చేయాలనుకుంటారు. అలాంటి వారందరికీ పోస్టాఫీసులో అద్భుతమైన పథకం ఉంది. అదే రికరింగ్ డిపాజిట్ స్కీమ్. ఎలాంటి రిస్క్ లేకుండా స్థిర ఆదాయ అందిస్తుంది. ప్రతి నెలా కొద్ది కొద్దిగా పొదుపు చేసుకుని 5 ఏళ్ల తరువాత పెద్ద మొత్తంలో డబ్బులు అందుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ హామీ ఉండడంతో ఇందులో ఎలాంటి రిస్క్ ఉండదు. క్రమం తప్పకుండా పొదుపు చేస్తే మంచి ఆదాయం పొందవచ్చు. ప్రతి నెలా వేతనం పొందే వ్యక్తులు, గృహిణులు తమ పిల్లల భవిష్యత్తు కోసం పొదుపు చేసే వారికి చాలా మంచి పథకం. మరి ఈ పథకానికి సంబంధించిన వివరాలు, వడ్డీ రేట్లు తెలుసుకుందాం. పోస్టాఫీస్ రికరింగ్ డిపాజిట్ పథకం ద్వారా ప్రస్తుతం వార్షిక వడ్డీ 6.7 శాతంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తోంది. త్రైమాసికానికి ఒకసారి చక్రవడ్డీ లెక్కిస్తారు. అంటే వడ్డీపైన వడ్డీ లభిస్తుంది. జనవరి నుంచి మార్చి 2026 వరకు ఇదే వడ్డీ రేటు లభిస్తుంది. నెలకు కనీసం రూ.100 పెట్టుబడితో రికరింగ్ డిపాజిట్ ఖాతా తెరవవచ్చు. ఆ తర్వాత రూ.10 గుణిజాలలో ఎంతైన జమ చేసుకోవచ్చు. ఈ పథకంలో ఎలాంటి గరిష్ఠ పరిమితి లేదు. కాలపరిమితి 5 సంవత్సరాలుగా ఉంటుంది. 5 సంవత్సరాల మెచ్యూరిటీ టెన్యూర్ ఉంటుంది. క్రమం తప్పకుండా నెల నెలా పొదుపు చేయడం ద్వారా అనుకున్న లక్ష్యాన్ని నెరవెర్చుకోవచ్చు. నెలకు రూ.11,111 జమ చేస్తూ వెళ్తే 5 ఏళ్లలో పెట్టుబడి మొత్తం రూ. 6,66,660 అవుతుంది. దీనిపై ఏడాదికి 6.7 శాతం వడ్డీ చొప్పున చూస్తే వడ్డీ రూపంలో రూ. 1,26,285 వస్తాయి. 5 సంవత్సరాలు పూర్తయితే మెచ్యూరిటీ నాటికి వడ్డీ, అసలు మొత్తం కలిపి రూ. 7,92,945 వస్తాయి. అంటే దాదాపు రూ.8 లక్షలు చేతికి అందుతాయి. ఈ రికరింగ్ డిపాజిట్ పథకంలో పెట్టుబడి పెట్టేవారికి వడ్డీ మాత్రమే కాకుండా మరికొన్ని అదనపు ప్రయోజనాలు ఉన్నాయి. ఏడాది పాటు వాయిదాలు చెల్లించిన తర్వాత మీ డిపాజిట్ నుంచి కొంత రుణంగా తీసుకోవచ్చు. అనుకోని ఖర్చులు ఎదురైనప్పుడు ఈ లోన్ సదుపాయం ఉపయోగపడుతుంది. అత్యవసర పరిస్థితుల్లో డబ్బు అవసరమై అకౌంట్ క్లోజ్ చేసి అందులోని డబ్బులు మొత్తం తీసుకోవచ్చు. అయితే 3 ఏళ్లు పూర్తయిన తర్వాతే ఖాతా క్లోజ్ చేసేందుకు అవకాశం ఉంటుంది. ఈ పథకంలో చేరేందుకు సమీప పోస్టాఫీసుకి వెళ్లి వివరాలు, కావాల్సిన డాక్యుమెంట్లు అందించి కనీస పెట్టుబడి ఇస్తే ఖాతా ఓపెన్ చేస్తారు. అయితే, పోస్టాఫీసు పథకాల్లో ప్రతి మూడు నెలలకు ఒకసారి వడ్డీ రేట్లను కేంద్ర ప్రభుత్వం సమీక్షిస్తుంది. కొన్నిసార్లు మార్చవచ్చు, కొన్నిసార్లు యథాతథంగా కొనసాగించే అవకాశం ఉంటుంది.

## నెమ్మదించిన సేవల రంగ వృద్ధి



దేశీయ సేవల రంగ వృద్ధి ఈ ఏడాది ఫిబ్రవరిలో స్వల్పంగా నెమ్మదించింది. కొత్త ఆర్డర్లలో పెరుగుదల 13 నెలల కనిష్ఠానికి పడిపోవడం ఇందుకు కారణం. ద్రవ్యోల్బణం పెరగడం, గిరాకీ ఓ మోస్తరుగానే పుంజుకోవడమూ ప్రభావం చూపిందని ఓ నెలవారీ సర్వే తెలిపింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వీసెస్ పీఎంఐ బిజినెస్ యాక్టివిటీ సూచీ ఫిబ్రవరిలో 58.1 పాయింట్లకు తగ్గింది. జనవరిలో ఇది 58.5 పాయింట్లుగా ఉంది. పీఎంఐ పరిభాషలో సూచీ 50 పాయింట్ల ఎగువన ఉంటే ఆ రంగంలో వృద్ధి ఉన్నట్లు; దిగువన ఉంటే క్షీణతగా పరిగణిస్తారు. ఫిబ్రవరిలో పీఎంఐ సూచీ 50 పాయింట్ల ఎగువన ఉన్నందున.. వృద్ధి ఉన్నప్పటికీ, జనవరితో పోలిస్తే స్వల్పంగా నెమ్మదించింది. పోటీ పెరగడంతో కొత్త ఆర్డర్ల రాక నెమ్మదించిందని హెచ్ఎస్‌బీసీ ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారి తెలిపారు. అంతర్జాతీయంగా విక్రయాలు పుంజుకోవడంతో, దానికి తగ్గట్లుగా నియామకాలను కంపెనీలు పెంచుకున్నాయని పేర్కొన్నారు. క్లయింట్ల ఎంక్వయిరీలు అధికంగా ఉండటం, మార్కెటింగ్ చర్యల వల్ల కొన్ని విభాగాల్లో విక్రయాలు పెరిగేందుకు తోడ్పడ్డాయని సర్వే వెల్లడించింది. పోటీ పరిస్థితులు పెరగడం వల్ల వృద్ధిపై ప్రభావం పడిందని కొన్ని కంపెనీలు తెలిపాయి. గత ఆగస్టు తర్వాత అంతర్జాతీయ విక్రయాల్లో వేగవంత వృద్ధి నమోదైనట్లు తెలిపింది. కంపెనీల నిర్వహణ వ్యయాలు గణనీయంగా పెరిగాయని, గత రెండున్నరేళ్లలోనే గరిష్ఠంగా నమోదయ్యాయని వివరించింది. దీంతో ఈ వ్యయాల భారంలో చాలా వరకు క్లయింట్లకే కంపెనీలు బదిలీ చేశాయని పేర్కొంది.

# రషీద్ ఖాన్‌పై వేటు.. అఫ్గనిస్తాన్‌కు కొత్త కెప్టెన్




అఫ్గనిస్తాన్ మేటి స్పిన్నర్ రషీద్ ఖాన్‌పై వేటు పడింది. టీ20 కెప్టెన్సీ నుంచి అఫ్గన్ క్రికెట్ బోర్డు అతడిని తొలగించింది. రషీద్ ఖాన్ స్థానంలో ఓపెనింగ్ బ్యాటర్ ఇబ్రహీం జద్రాన్‌ను కొత్త కెప్టెన్‌గా నియమించింది. ఇందుకు సంబంధించి ఏసీబీ గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. శ్రీలంకతో జరిగే పరిమిత ఓవర్ల సిరీస్ నుంచి ఇబ్రహీం జద్రాన్ అఫ్గన్ టీ20 జట్టు సారథిగా వ్యవహరిస్తాడని తెలిపింది. ఈ సందర్భంగా రషీద్ ఖాన్ కెప్టెన్సీలో జట్టు సాధించిన చిరస్మరణీయ విజయాన్ని ఏసీబీ ప్రస్తావించింది. "అఫ్గనిస్తాన్ టీ20 జట్టు కెప్టెన్‌గా రషీద్ ఖాన్ పదవీ కాలంలో జట్టు గుర్తుండిపోయే విజయాలు సాధించింది. ముఖ్యంగా 2024 టీ20 ప్రపంచకప్ టోర్నీలో ఏకంగా సెమీ ఫైనల్‌కు చేరుకుంది. అయితే, ఏసీబీ దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని యాజమాన్యంలో మార్పులు తీసుకువచ్చింది. కొత్త హెడ్‌కోచ్ వచ్చారు. అదే విధంగా కెప్టెన్‌ను కూడా మార్చాలని నిర్ణయించుకున్నాం. రషీద్ ఖాన్ డిప్యూటీగా పనిచేసిన ఇబ్రహీం జద్రాన్‌కు పగ్గాలు అప్పగించాము. రషీద్ ఖాన్ సేవలను మేము ప్రశంసిస్తున్నాం. అలాగే ఇబ్రహీం జద్రాన్ తన కొత్త,అతి ముఖ్యమైన పాత్రలో రాణించాలని కోరుకుంటున్నాం" అంటూ అఫ్గనిస్తాన్ చీఫ్ సెలక్టర్ అహ్మద్ షా సలీమనిఖిల్ ప్రకటన విడుదల చేశాడు. కాగా మార్చి 13, 15, 17 తేదీల్లో అఫ్గనిస్తాన్- శ్రీలంక మధ్య షార్జాలో మూడు టీ20లు, దుబాయ్‌లో మార్చి 20, 22, 25 మూడు వన్డేలకు షెడ్యూల్ ఖరారైంది. ఇందుకు సంబంధించి జట్లను ఏసీబీ తాజాగా ప్రకటించింది.

**టీ20 ప్రపంచకప్-2026లో అఫ్గనిస్తాన్ వైఫల్యం**

గత ఎడిషన్ ప్రభావంతో ఓ మోస్తరు అంచనాలతో బరిలోకి దిగిన అఫ్గనిస్తాన్ ఈసారి నిరాశపరిచింది. గ్రూప్-డి నుంచి సౌతాఫ్రికా, న్యూజిలాండ్, యూఏఈ, కెనడా జట్లతో పోటీపడిన అఫ్గన్ జట్టు.. నాలుగింట కేవలం రెండు విజయాలే సాధించింది. ఫలితంగా సూపర్-8కు చేరకుండానే నిష్క్రమించింది. ఈ క్రమంలో జొనాథన్ ట్రాట్ హెడ్‌కోచ్‌గా తప్పుకోగా.. స్థానంలో కొత్త హెడ్ కోచ్‌గా రిచర్డ్ పైబస్‌ను నియమించింది ఏసీబీ. శ్రీలంకతో సిరీస్ సందర్భంగా కోచ్‌గా అతడు బాధ్యతలు చేపట్టనున్నాడు.

**శ్రీలంకతో టీ20 సిరీస్‌కు అఫ్గన్ జట్టు**

ఇబ్రహీం జద్రాన్ (కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), నూర్ రెహమాన్ (వికెట్ కీపర్), సెదిఖుల్లా అటల్, దర్విష్ రసూలీ, షాహిదుల్లా కమల్, అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీ, షరాఫుద్దీన్ అష్రఫ్, రషీద్ ఖాన్, నూర్ అహ్మద్, ముజీబ్ ఉర్ రహ్మాన్, జియా ఉర్ రహ్మాన్ షరీఫీ, ఫరీద్ అహ్మద్, అబ్దుల్లా అహ్మద్‌జాయ్

**శ్రీలంకతో వన్డే సిరీస్‌కు అఫ్గన్ జట్టు**

హష్మతుల్లా షాహిదీ (కెప్టెన్), రహ్మత్ షా (వైస్ కెప్టెన్), రహ్మానుల్లా గుర్బాజ్ (వికెట్ కీపర్), ఇక్రామ్ అలీఖిల్ (వికెట్ కీపర్), ఇబ్రహీం జద్రాన్, సెదీఖుల్లా అటల్, దర్విష్ రసూలీ, అజ్మతుల్లా ఒమర్జాయ్, మహ్మద్ నబీ, రషీద్ ఖాన్, నంగ్యాల్ ఖరోటీ, జియా ఉర్ రహ్మాన్ షరీఫీ, ఫరీద్ అహ్మద్, బిలాల్ సమీ.

## ఐదు రోజులుగా కోల్‌కతాలోనే.. మమ్మల్ని ఎప్పుడు పంపిస్తారు..!



పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావం వెస్టిండీస్ జట్టుపై పడింది. పొట్టి ప్రపంచకప్ సూపర్ 8 మ్యాచ్‌లో భారత జట్టు చేతిలో ఓడిన విండీస్ బృందం ఇంకా కోల్‌కతాలోనే ఉండిపోయింది. యుద్ధం కారణంగా విమాన సర్వీసులు రద్దైన నేపథ్యంలో కరీబియన్ ఆటగాళ్లు స్వదేశం వెళ్లేందుకు పడిగాపులు కాస్తున్నారు. హెడ్‌కోచ్ డారెన్ సమీ (ఝుతీవఅ ఞఖఎఎఎ) అయితే.. తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు. నేను ఇంటికి వెళ్లాలనుకుంటున్నా అని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో మార్చి 1 ఆదివారం సెమీస్ బెర్తు కోసం భారత్, వెస్టిండీస్ తలపడ్డాయి. కానీ, ఆ మ్యాచ్‌లో సంజూ శాంసన్ విధ్వంసంతో విండీస్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. అమెరికా, ఇజ్రాయేల్ -- ఇరాన్ యుద్ధం కారణంగా వారిని వెంటనే పంపించలేని పరిస్థితి. దాంతో.. ఆ రోజు నుంచి ఇప్పటివరకూ కరీబియన్ ఆటగాళ్లు కోల్‌కతాలోనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఆ జట్టు హెడ్‌కోచ్ డారెన్ సమీ ఎక్స్ పోస్ట్‌లో తన ఆవేదనను వ్యక్తం చేశాడు. 'నేను ఇంటికి వెళ్లాలనుకుంటున్నా. మమ్మల్ని ఎప్పుడు పంపిస్తారో చెప్పండి. మేము కోల్‌కతాలోనే ఉండి ఐదు రోజులైంది. ఈరోజు.. రేపు.. కాంటే వచ్చే వారం.. ఏదో ఒక రోజు పంపిస్తామని అయినా చెప్పండి' అని సమీ తన పోస్ట్‌లో రాసుకొచ్చాడు. సమీ పోస్ట్‌లో వెస్టిండీస్ క్రికెట్‌గానీ, భారత క్రికెట్ నియంత్రణ మండలిగానీ ఇంకా స్పందించలేదు.

# స్పోర్ట్స్

## జింబాబ్వే జట్టుకు భారీ ఊరట




జింబాబ్వే క్రికెట్ జట్టుకు భారీ ఊరట లభించింది. ఎట్టకేలకు స్వదేశానికి వెళ్లే మార్గం సుగమమైంది. టీ20 ప్రపంచకప్-2026 టోర్నీలో జింబాబ్వే చిరస్మరణీయ విజయాలు సాధించిన విషయం తెలిసిందే.

**ఆస్ట్రేలియా, శ్రీలంకను ఓడించి**


భారత్- శ్రీలంక వేదికగా ఈ మెగా టోర్నీలో గ్రూప్-బి నుంచి శ్రీలంక, ఆస్ట్రేలియా, ఐర్లాండ్, ఒమన్‌లతో కలిసి జింబాబ్వే పోటీ పడింది. అనూహ్య రీతిలో మాజీ చాంపియన్లు ఆస్ట్రేలియా, శ్రీలంకను ఓడించి గ్రూప్ టాపర్‌గా సూపర్-8 చేరింది. అయితే, కీలక దశలో వెస్టిండీస్, టీమిండియా, సౌతాఫ్రికా చేతిలో ఓడి నిష్క్రమించింది.

**యుద్ధం కారణంగా**

ఈ నేపథ్యంలో మార్చి 2న భారత్ నుంచి జింబాబ్వే జట్టు స్వదేశానికి పయనం కావాల్సింది. కానీ ఇరాన్- ఇజ్రాయెల్, అమెరికాల యుద్ధం కారణంగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న సంగతి తెలిసిందే. దీంతో గల్ఫ్ వేదికగా ప్రయాణించాల్సిన విమాన సర్వీసులకు అంతరాయం కలిగింది. ఫలితంగా జింబాబ్వే జట్టు బుధవారం వరకు ఇండియాలోనే ఉండిపోవాల్సి వచ్చింది. ఈ క్రమంలో బ్యాచ్‌ల వారీగా భారత్‌ను వీడేందుకు జింబాబ్వే సిద్ధమైనట్లు ఆ దేశ క్రికెట్ బోర్డు ప్రకటన విడుదల చేసింది. బుధవారం తొలి బ్యాచ్ స్వదేశానికి పయనం కాగా.. శుక్రవారం ఆఖరి బ్యాచ్ ఇండియా నుంచి బయల్దేరుతుందని తెలిపింది.

**అందుకే విడతల వారీగా**

ఇందుకు సంబంధించిన ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయని పేర్కొంది. తగినన్ని విమానాలు అందుబాటులో లేనందున విడతల వారీగా ఆటగాళ్లు జింబాబ్వేకు చేరుకుంటాడని బోర్డు వెల్లడించింది. షెడ్యూల్ ప్రకారం జింబాబ్వే జట్టు దుబాయ్ మీదుగా ఎమిరేట్స్ ఫ్లైట్‌లో వెళ్లాల్సింది. అయితే, యుద్ధ ప్రభావం కారణంగా అదిస్ అబాబా, ఇథియోపియా మీదుగా హరారేకు వారు చేరుకోనున్నట్లు సమాచారం. మరోవైపు.. వెస్టిండీస్ క్రికెట్ జట్టు సైతం భారత్‌లో చిక్కుకుపోయిన విషయం తెలిసిందే.



# గ్లింప్స్‌తోనే భయపెట్టిన నాగచైతన్య

'అతీంద్రియ శక్తి మేల్కోన్నప్పుడు..సృష్టి ధర్మం తప్పినప్పుడు..విధి ఒక వృషకర్మను ఎంచుకుంటుంది' అనే పవర్‌ఫుల్ డైలాగ్‌తో 'వృషకర్మ' గ్లింప్స్ రిలీజ్ అయింది. 'విరూపాక్ష'ఫేం కార్తిక్ దండు దర్శకత్వంలో నాగచైతన్య హీరోగా నటించిన తాజా చిత్రం 'వృషకర్మ'. ఇందులో చైతూకి జోడీగా మీనాక్షి చౌదరి నటిస్తోంది. జయరామ్, స్పర్ష్ శ్రీవాస్తవ, సత్య కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా రిలీజ్ అయిన ఈ మూవీ గ్లింప్స్‌లో నాగ చైతన్య లుక్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంది. గత చిత్రాలతో పోలిస్తే ఆయన బాడీ లాంగ్వేజ్ గ్రేడ్ చాలా కొత్తగా ఉంది. గ్లింప్స్‌తోనే భయపెట్టేశారు. అజనీష్ లోక్‌నాథ్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఈ గ్లింప్స్‌కు ప్రాణం పోసింది. బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ , సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి.

# శివాజీ కొత్త సినిమాకి సూపర్ ఆఫర్

టాలీవుడ్ ఇండస్ట్రీలో హిట్ జోడీగా పేరు తెచ్చుకున్న వారిలో శివాజీ, లయ కూడా ఉంటారు. వీరిద్దరూ చాలా సంవత్సరాల తర్వాత సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని అనే చిత్రంలో కలిసి నటించారు.సుధీర్ శ్రీరామ్ దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రాన్ని శ్రీ శివాజీ ప్రొడక్షన్స్ బ్యానర్ పై శివాజీ నిర్మించాడు. ఈ సినిమాని మొదట ఈటీవీ విన్ ఓటీటీలో నేరుగా విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అందుకు సంబంధించిన విడుదల తేదీని కూడా అనౌన్స్ చేశారు. ఆ తర్వాత సడన్గా ఈ చిత్రాన్ని ఓటీటీలో కాకుండా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అలాగే ఈ మూవీని మార్చి 6వ తేదీన రిలీజ్ చేయనున్నట్లు అనౌన్స్ చేశారు. గత కొంతకాలంగా చిన్న సినిమాలకు టికెట్ రేట్లను తగ్గిస్తూ వస్తున్న విషయం మనకు తెలిసిందే. దానితో కంటెంట్ బాగున్న చిన్న సినిమాలకు మంచి కలెక్షన్లు వస్తున్నాయి. ఇక సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని మూవీ బృందం కేవలం టికెట్ రేట్లను తగ్గించడం మాత్రమే కాకుండా మరో సూపర్ సాలిడ్ ఆఫర్ను కూడా అనౌన్స్ చేసింది. తాజాగా ఈ మూవీ యూనిట్ సింగల్ స్క్రీన్ ఉన్న థియేటర్లలో నలుగురు కలిసి టికెట్ తీసుకున్నట్లయితే 499 రూపాయలకే నాలుగు టికెట్లు మరియు ఒక పాప్‌కార్న్ ఇస్తామని, అదే మల్టీప్లెక్స్ థియేటర్లలో నలుగురికి పాప్‌కార్న్ తో కలిపి టికెట్ ధర కేవలం 699 రూపాయలే అని ప్రకటించారు. మరి ఈ ఆఫర్ ఈ సినిమా కలెక్షన్లపై ఎలాంటి ప్రభావాన్ని చూపుతుందో చూడాలి.



# మీ చెల్లెలు షాట్ స్కట్ వేసుకుంటే రేప్ చేయాలని మీకు అనిపిస్తుందా

నటిగా మంచి గుర్తింపు తెచ్చుకున్న వరలక్ష్మీ శరత్‌కుమార్ ఇప్పుడు డైరెక్షన్‌లోకి అడుగు పెట్టింది. ఆమె స్వీయ దర్శకత్వంలో ప్రియమణి, ప్రకాష్ రాజ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'సరస్వతి'.మార్చి 6న ఈ సినిమా విడుదలకు సిద్ధంగా ఉండటంతో.. ప్రమోషన్స్‌లో జోరు పెంచిన చిత్ర బృందం వరుస ఇంటర్వ్యూస్ ఇస్తున్నారు. ఇందులో భాగంగానే రీసెంట్‌గా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వరలక్ష్మి శరత్ కుమార్ మహిళల డ్రెస్సింగ్‌పై షాకింగ్ కామెంట్స్ చేసింది. మహిళలు వేసుకునే బట్టల కారణంగానే చాలా తప్పులు జరుగుతున్నాయని కొంతమంది మెన్స్ అభిప్రాయపడుతున్నారు.. దీనిపై మీరు ఏమంటారు అని యాంకర్ ప్రశ్నించగా.. 'మీకు ఒక చెల్లి ఉంది. ఆ చెల్లి ఒక షాట్ స్కట్ వేసుకుని వెళ్తుంది.. తనని రేప్ చేయాలని మీకు అనిపిస్తుందా? అనిపించదు కదా. ఇప్పుడు మగాళ్లు కూడా ఒక జీన్ ప్యాంట్ ఎంత ఒనీలి ఉంటుంది అంటే బెండ్ చేస్తే మొత్తం తెలుస్తుంది. అలాఅని నేను పోయి వాడిని జంప్ చేసి ఇలా చెయ్, అలా చెయ్ అని చెప్పను కదా.. ఇప్పుడు ఇన్నర్ వేర్ అనేది అందరూ ఉపయోగిస్తారు. మీరు కూడా చెడ్డీలు వేసుకుంటారు. మీది అందరికి కనిపిస్తది పర్వాలేదు. కానీ ఒక ఉమెన్ ది బ్రా స్ట్రాప్ బయటకు కనిపిస్తే చాలు గోల గోల చేస్తారు. లైఫ్ మొత్తం పోయింది అన్నట్లు చేస్తారు. ఏం ఉంది అందులో ఒక ఇన్నర్ వేర్ అంతే కదా. ఊరికే జడ్జ్ చేస్తారు ఎందుకు.. వాళ్ల బాడీ వాళ్ల ఇష్టం కదా. ఇప్పుడు మీ అమ్మతో, చెల్లితో మీకు అలాంటి ఫీల్ లేనప్పుడు బయట అమ్మాయి దగ్గర ఎందుకు ఆ ఫీల్ వస్తుంది' అంటూ ఫైర్ అయింది. ప్రజెంట్ ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సంచనలంగా మారాయి.



# మరో ఓటీటీకి 'లాల్ సలామ్' .. స్ట్రీమింగ్ ఎక్కడంటే?

తమిళ హీరో రజనీకాంత్ ప్రత్యేక పాత్రలో నటించిన చిత్రం 'లాల్ సలామ్'.. 2024 విడుదలైన ఈ మూవీ ఇప్పటికే సన్ నెక్ట్స్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. అయితే, తాజాగా హిందీ వర్షన్ ఓటీటీలోకి వచ్చేసింది.రజనీకాంత్ కుమార్తె ఐశ్వర్య దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రంలో విష్ణు విశాల్, విక్రాంత్ సంతోష్ ప్రధాన పాత్రల్లో నటించగా రజనీకాంత్ అతిథి పాత్రలో కనిపించారు. 'లాల్ సలామ్' మూవీ సన్ నెక్ట్స్(రాబల చీశు)లో తెలుగు, తమిళ్ వర్షన్‌లో స్ట్రీమింగ్ అవుతుంది. హిందీ వర్షన్ జియోహాట్‌స్టార్‌లో అందుబాటులో ఉంది. ఈ క్రమంలో తాజాగా హిందీ వర్షన్‌ను అమెజాన్ ప్రైమ్ వీడియోలో కూడా స్ట్రీమింగ్ అవుతుంది. కానీ, ఈ మూవీని చూడాలంటే అదనంగా రెంట్ చెల్లించాల్సి ఉందని పేర్కొనడం విశేషం. ఇప్పటికే ఒక ఓటీటీలో ఉచితంగా చూసే అవకాశం ఉన్న ఈ మూవీకి అదనంగా రెంట్ చెల్లించేలా షరతు పెట్టడం కాస్త ఆశ్చర్యానికి గురిచేస్తుంది. సుమారు రూ. 90 కోట్ల బడ్జెట్‌తో లైకా ప్రొడక్షన్స్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మించిన ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద కేవలం రూ. 52 కోట్లు మాత్రమే రాబట్టి భారీ డిజాస్టర్‌గా మిగిలిపోయింది. 'లాల్ సలామ్' కథ మొత్తం 1990ల కాలం బ్యాక్‌డ్రాప్‌తో నడుస్తోంది. మొయిదీన్ భాయ్ (రజనీకాంత్) కుమారుడు సంషి (విక్రాంత్), గురు (విష్ణు విశాల్) స్నేహితులు. షంషుద్దీన్ (విక్రాంత్)ను క్రికెటర్‌ను చేయాలన్నది తండ్రి కల. అనుకున్నట్లు గానే సంషి రాష్ట్ర రంజీ జట్టుకు ఆడటానికి ఎంపికవుతాడు. ఈ క్రమంలో ఆ ఊళ్లో త్రీస్టార్ – ఎంసీసీ టీమ్స్ మధ్య జరిగే క్రికెట్ ఆటతో రెండు మతాల మధ్య గొడవ మొదలౌతుంది. ఆ గొడవలోనే షంషుద్దీన్ చేతిని నరికేస్తాడు గురు అలియాస్ గురునాథం (విష్ణు విశాల్).. దాడి చేసిన గురు కూడా మొయిదీన్ భాయ్‌కి ప్రాణ స్నేహితుడు అయిన (ఫిలిప్ లివింగ్‌స్టోన్) కుమారుడు కావడం విశేషం. హిందూ ముస్లింలు ఐకమత్యంగా ఉండే ఆ ఊరిలో క్రికెట్ వల్ల మత కల్లోలంగా మారుతుంది. ముంబైలో వ్యాపారావేత్తగా రాణిస్తున్న మొయిద్దీన్ అ గ్రామానికి తిరిగొస్తాడు. కుమారుడి చేయి నరికిన స్నేహితుడి కుటుంబాన్ని మొయిదీన్ ఏం చేస్తాడు..? క్రికెట్‌లో గొడవలకు కారణం ఏంటి..? సంషి, గురు ప్రాణ స్నేహితుల మధ్య చిచ్చు ఎలా మొదలైంది..? తన కొడుకు చేయి నరికిన గురును మొయిద్దీన్ ఏం చేశాడు..? అనేది తెలియాలంటే జూన్ 6న సన్ నెక్ట్స్‌లో లాల్ సలామ్ చూడాల్సిందే.



Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com